

చంద్రబాబుతో ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన మహిళలు



గూడూరులో టీడీపీ నాయకులతో కలిసి బర్త్‌డే కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు

గూడూరును నెల్లూరులో చేరుస్తా

- మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు హామీ



చిన్నారికి నామకరణం

మహిళలతో ముఖాముఖి కార్యక్రమంలో చంద్రబాబు ఓ చిన్నారికి నామకరణం చేశారు.గూడూరు మండలం చెన్నూరుకు చెందిన సాయిప్రియ చంద్రబాబు అభిమాని. 20 రోజుల క్రితం ఆమె ఓ పాపకు జన్మనిచ్చింది. చంద్రబాబు గూడూరుకు రావడంతో తన కుమార్తెకు పేరుపెట్టాలని చంద్రబాబును కోరింది.చంద్రబాబు సభాస్థలి మీదకు ఆమెను పిలిపించి చిన్నారిని ఎత్తుకుని హాసిని అని నామకరణం చేశారు.

గూడూరు, ఏప్రిల్ 20 : ఈసారి అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని తిరిగి నెల్లూరు జిల్లాలో కలుపుతానని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు.గూడూరు పట్టణంలోని సీఆర్‌రెడ్డి కల్యాణ మండపంలో శనివారం ఉదయం ఆయన మహిళలతో ముఖాముఖి నిర్వహించారు.తొలుత చంద్రబాబు జన్మదిన వేడుకలను టీడీపీ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.చంద్రబాబు సభాస్థలికి రాగానే హ్యాపీ బర్త్‌డే అంటూ పెద్దఎత్తున అందరూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసిన చంద్రబాబుకు వారంతా శుభాకాంక్షలు తెలిపారు.అక్కడే నిర్వహించిన రక్తదాన శిబిరంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ మహిళల మధ్య జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా వుందన్నారు. మహిళలకు మొదటిసారి 8శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ఎన్టీఆర్‌దేనన్నారు. ఆడబిడ్డలను ప్రపంచంలో తిరుగులేని శక్తిగా మార్చేందుకు తానూ కృషి చేస్తానన్నారు. మహిళల కోసం మద్యనిషేధాన్ని అమలుపరుస్తానని హామీ ఇచ్చిన జగన్ నాసిరకం మద్యం విక్రయిస్తూ ఎంతోమంది మరణాలకు కారణమవుతున్నాడన్నారు.బటన్ నొక్కి అందినకాడికి నొక్కేస్తున్నాడని విమర్శించారు.ఆయన జగన్మోహన్‌రెడ్డి కాదని జే గన్‌రెడ్డి, మోసపురెడ్డి, జలగరెడ్డి అని ఎద్దేవా చేశారు. కొద్దిరోజుల్లో ఓటరు చేతికి రెండు బటన్లు వస్తాయని అందులో బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌కు ఒకటి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్‌కు మరొకటి నొక్కి జగన్‌ను ఇంటికి సాగనంపాలన్నారు. చిల్లకూరులో సిలికాను, సూళ్లూరుపేట నియోజకవర్గంలో స్వర్ణముఖి నది నుంచి ఇసుకను వైసీపీ నాయకులు అక్రమంగా దోచుకున్నారన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే సిలికా, ఇసుక అక్రమ రవాణాను నియంత్రించి సహజసంపదను భావితరాలకు అందించే బాధ్యత తీసుకుంటానని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో కూటమి అభ్యర్థులు పాశిం సునీల్‌కుమార్, వరప్రసాద రావు, పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, వెంకటగిరి ఎమ్మెల్యే అభ్యర్థి కురుగొండ్ల రామకృష్ణ,సూళ్లూరుపేట అభ్యర్థిని నెలవల విజయశ్రీ, మాజీ ఎమ్మెల్యేలు సుగుణమ్మ, పరసారత్నం, నెలవల సుబ్రమణ్యం,నాయకులు నరసింహయాదవ్, వాకాటి నారాయణరెడ్డి, పనబాక కృష్ణయ్య, శీలం కిరణ్‌కుమార్, తానంకి నానాజీ, జనసేన కో ఆర్డినేటర్ తీగల చంద్రశేఖర్, బీజేపీ నాయకుడు పాపాపురుషోత్తంరెడ్డి, సీబీఎన్ ఫోరం నాయకురాలు సునీత, సంధ్యారాణి, చక్రల ఉష తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడుపై పెద్దిరెడ్డి పెత్తనమేంటి?

- టీడీపీ అధినేత సూటి ప్రశ్న



సత్యవేడు, ఏప్రిల్ 20: 'నీది ఏ ఊరు పెద్దిరెడ్డీ? సత్యవేడుపై నీ పెత్తనమేంటి? సత్యవేడు నుంచి రోజుకు 200 టిప్పర్ల గ్రావెల్, ఇసుక చెన్నైకు తరలించింది నిజం కాదా? సురుటుపల్లి దగ్గర నేనే చూశా. ఆకాశమే హద్దుగా దోపిడీ చేశారు ' అంటూ చంద్రబాబు ధ్వజమెత్తారు.ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి సత్యవేడు క్లాక్ టవర్ వద్ద జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు.' ఎక్కడో పుంగనూరులో ఉండే పెద్దిరెడ్డి సత్యవేడులోని ఇసుక, మట్టిని చెన్నైలో అమ్ముకుంటాడు. ప్రశ్నించిన ఎమ్మెల్యే ఆదిమూలాన్ని ఈసారి పనికిరావన్నారు. ఇదేం పద్ధతి' అంటూ ప్రశ్నించారు. 'సత్యవేడుకు సమీపంలోనే నేషనల్ హైవే, శ్రీసిటీ ఉంది.ఇది పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న ప్రాంతం. ప్రత్యేక ప్రణాళికతో సత్యవేడు, వరదయ్యపాళెం ప్రాంతాలను ఆదునిక నగరాలకు దీటుగా తీర్చిదిద్దుతా.సత్యవేడును జిల్లాలోనే నెంబర్ వన్‌గా అభివృద్ధి చేస్తా. ఆ బాధ్యత నాదీ' అని భరోసా ఇచ్చారు. సత్యవేడు డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం నిర్మించడంతో పాటు ఇక్కడే ఆర్డీవో, డీఎస్పీ కార్యాలయాలను ఏర్పాటు చేస్తానని తెలిపారు. కేవీబీపురం మండలంలోని కాళంగి రిజర్వాయర్‌ను ఆధునికీకరిస్తానని, అరుణానదిలో ఇసుక అక్రమ రవాణాను నియంత్రిస్తానని, నదీ పరివాహక ప్రాంతలో భూగర్భ జలాల పెంపుకోసం విరివిగా చెక్‌డ్యాంలు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. దాసుకుప్పం - సత్యవేడు బైపాస్ రోడ్డు , మతంగీశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులు చేపడతామన్నారు. తెలుగు గంగ కాలువకు ఉపకాలువలు నిర్మించి నియోజకవర్గానికి తాగు, సాగు నీరును అందిస్తామన్నారు. సురుటుపల్లె, నారాయణవనం ప్రాంతాలను పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని తెలిపారు. శ్రీసిటీలో ప్రస్తుతమున్న 192 పరిశ్రమలకు తోడు మరో 400 పరిశ్రమలు వచ్చేలా చూస్తానన్నారు. హీరో, అపోలో, శ్రీసిటీ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చేలా చర్యలు చేపడతామన్నారు.'అటవీ భూముల్లో యూకలిప్టస్ చెట్లను కూడా రూ.7వేల విలువ చేసేవి రూ.3వేలకు కొని, రూ 4 వేలు కొట్టేసే సైకో బ్యాచ్ జిల్లాలో తిష్టవేసింది.చివరకు వైసీపీ ఎర్రచందనం స్మగ్లర్‌కు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చే స్థాయికి దిగజారింది' అని చంద్రబాబు విమర్శించారు.గోదావరి జలాలను సత్యవేడుకు తీసుకొచ్చి ఇక్కడివారి జీవితాలు మారుస్తానన్నారు.

అన్నీ ఆలోచించే ఆదిమూలానికి టికెట్

'వైసీపీ నుంచి వచ్చాడని ఆదిమూలంపై టీడీపీ నాయకులకు అనుమానం ఉండొచ్చు. నేను అన్నీ ఆలోచించా. ఒక దుర్మార్గుడిపై నువ్వెంతంటే నువ్వెంత అని తిరుగుబాటు చేసి, ఎంపీ సీటు ఇస్తానంటే, ఎంపీ టికెట్టొద్దు, మీ పార్టీ వద్దని మొహంమీదే చెప్పి వచ్చిన వ్యక్తి ఆదిమూలం.అక్కడే నేను ఆలోచించా.ఒక తిరుగుబాటు నాయకుడు దొరికాడని ఆలోచించే అభ్యర్థిగా ప్రకటించా. ఆదిమూలం నా దగ్గరే పెరిగాడు. టీడీపీలోనే జడ్పీటీసీ, ఫ్లోర్‌లీడర్, ఎస్సీసెల్ అధ్యక్షుడిగా పనిచేశాడు. హేమలత, జేడీఆర్ పార్టీ కోసం కష్టపడ్డారు. వారి కష్టాన్ని గుర్తించి సముచిత స్థానం కల్పిస్తాం' అని చంద్రబాబు హామీ ఇచ్చారు.బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వరప్రసాద్ కూడా వైసీపీలో అవమానాలు భరించలేక తిరుగుబాటు చేశారని గుర్తు చేశారు.వీరిద్దరినీ ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు.



సత్యవేడు సభలో చంద్రబాబు ప్రసంగం

కురుగొండ్ల రామకృష్ణకే వెంకటగిరి టికెట్



వెంకటగిరి/డక్కిలి, ఏప్రిల్ 20 : వెంకటగిరి అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ టికెట్ మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణను వరించింది. టీడీపీ అధిష్ఠానం శనివారం రామకృష్ణకు ఫోన్ చేసి అమరావతికి వచ్చి బీ ఫామ్ తీసుకెళ్లాలని కబురు పెట్టింది.తొలుత మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఉద్దేశంతో టికెట్‌ను ఆయన కుమార్తె కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియకు కేటాయించిన విషయం తెలిసిందే.ఇప్పటికే వైసీపీ నుంచి నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో టీడీపీలో చేరిపోవడంతో దుర్భేద్యంగా కనిపిస్తున్న తెలుగుదేశం ఇకపై మరింత స్పీడు పెంచనుంది.ఈ సందర్భంగా తన తండ్రి విజయం కోసం యువతను కూడగడతానని లక్ష్మీసాయిప్రియ ప్రకటించారు.నియోజకవర్గంలో తన తండ్రి చేసిన అభివృద్ధిని ఈ ప్రాంత ప్రజలు ఇప్పటికీ చెప్పుకొంటున్నారని, తాను ఆ విషయాన్ని ప్రచారానికి వెళ్లినప్పుడు గమనించానన్నారు.

సైకో భర్తను భరించలేనంటూ...

- పెళ్లయిన 5 నెలలకే యువతి బలవన్మరణం



ఘటనా స్థలంలో భోరున విలపిస్తున్న కవిత బంధువులు



కవిత (ఫైల్ ఫొటో)

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20 : సైకో భర్తను భరించలేనంటూ...పెళ్లయిన 5 నెలలకే ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. వివాహ జీవితంలో తాను అనుభవించిన మానసిక క్షోభను సూసైడ్ నోట్‌లో రాసుకుని మరీ రైలు కింద పడి తనువు చాలించిన ఈ హృదయ విదారక ఘటన ఏర్పేడులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. సూసైడ్ నోట్‌లో సమాచారం మేరకు... ఏర్పేడు మండలం అముదూరు గ్రామానికి చెందిన కవిత ఓ సంస్థలో నర్సుగా పనిచేసేది.ఐదు నెలల క్రితం గాజుల మండ్యం ప్రాంతానికి చెందిన బాలాజీ అనే యువకుడితో వివాహం జరిగింది.కొద్ది కాలానికే భార్యాభర్తల మధ్య అనుమానం చిచ్చురేపింది.తన ఫోన్ బిజీ వచ్చినా... ఎప్పుడైనా పనిలో ఉండి ఫోన్ ఎత్తకపోయినా అనుమానంతో తీవ్రంగా వేధించేవాడని కవిత లేఖలో పేర్కొంది.పలు రకాలుగా తనను దారుణంగా బాలాజీ టార్చర్ చేశాడంటూ రాసుకుంది. శనివారం సాయంత్రం అమ్మగారి ఇంటి నుంచి భర్త వద్దకు బయలుదేరిన ఆమె ఏర్పేడులో దిగి రైలు కిందపడి చనిపోయింది. స్థానికులు గమనించి రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. రైల్వే ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ రవి, ఏఎస్ఐ రమేష్ బాబు ఘటనా స్థలానికి చేరుకున్నారు. సూసైడ్ నోట్ ఆధారంగా సమీపంలోని అముదూరు గ్రామానికి చెందిన కవితగా గుర్తించారు. ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఘటనా స్థలానికి చేరుకుని గుండెలు బాదుకున్నారు. తమ బిడ్డ వివాహమైన ఐదు నెలలకే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందంటూ కన్నీటిపర్యంతమయ్యారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

మూడో రోజున 19 నామినేషన్లు

- ఎంపీకి ఇద్దరు.. అసెంబ్లీకి 17 మంది

తిరుపతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సార్వత్రిక ఎన్నికలకు శనివారం మొత్తం 19 మంది 20 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. తిరుపతి పార్లమెంటు నియోజకవర్గానికి బీజేపీ అభ్యర్థి వరప్రసాద్ తనయుడు నవీన్ గుప్తా బీజేపీ డమ్మీ అభ్యర్థిగా ఒకటి, ఇండిపెండెంటుగా ఒకటి చొప్పున రెండు నామినేషన్లు వేయగా, బీఎస్పీ తరపున రిటైర్డు జడ్జి గుర్రప్ప నామినేషన్ పత్రాలు సమర్పించారు.ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లకు గానూ వెంకటగిరిలో నామినేషన్లు దాఖలు కాలేదు.శ్రీకాళహస్తిలో వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి పోతుగుంట రాజేష్ నాయుడు, వైసీపీ డమ్మీ అభ్యర్థిగా శ్రీవాణి, ఇండిపెండెంట్‌గా తీగల భాస్కర్ నామినేషన్లు వేశారు. తిరుపతిలో సీపీఐ అభ్యర్థి పి.మురళి, జై హిందూస్థాన్ అభ్యర్థి నీలకంఠ, ఇండిపెండెంట్లుగా కృష్ణ చైతన్య, పెంచల ప్రసాద్, భార్గవ్, సోమశేఖర్, నరేష్, బెనర్జీ, సాయిప్రసన్నకుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. సత్యవేడులో మాజీ ఎమ్మెల్యే హేమలత, గూడూరులో బీఎస్పీ అభ్యర్థి ఎ.మల్లికార్జున, సూళ్లూరుపేటలో ఇండిపెండెంట్‌గా బి.లీలామోహన్, చంద్రగిరిలో ఇండిపెండెంట్‌గా శ్రీచరణ్ నామినేషన్లు దాఖలు చేశారు.

పోలింగ్‌కు 469 బస్సుల కేటాయింపు

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 20: మే 13వ తేదీన జరిగే పోలింగ్‌కు 469 ఆర్టీసీ బస్సులను కేటాయించారు.ఎన్నికల సామగ్రి,ఉద్యోగులను పోలింగ్ కేంద్రాలకు తరలించడానికి బస్సులను కేటాయించాలని జిల్లా యంత్రాంగం కోరింది. దీంతో నియోజకవర్గాల వారీగా.. గూడూరుకు 31, సూళ్లూరుపేటకు 44, వెంకటగిరికి 44, చంద్రగిరికి 66, తిరుపతికి 34, శ్రీకాళహస్తికి 41, సత్యవేడుకు 36బస్సులను కేటాయించారు. వీటిని నడపడానికి 469 మంది డ్రైవర్లు హాజరవుతున్న కారణంగా వీరందరికీ పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు.

టీడీపీ నేతల తోటలు, షెడ్లలో
లిక్కర్ డంప్‌కి చెవిరెడ్డి యత్నం
- పోలీసులను, అధికారులను వాడుకుంటున్నారు
- చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోపణ

తిరుచానూరు, ఏప్రిల్ 20: 'టీడీపీ నేతలకు సంబంధించిన మామిడి తోటలు, పారిశ్రామికవేత్తల షెడ్లలో లిక్కర్ డంప్ చేయడానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి యత్నిస్తున్నారు. దీనికోసం పోలీసులను, అధికారులను వాడుకుంటున్నారు' అని చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆరోపించారు. తనిఖీల్లో భాగంగా పోలీసులు, ఎన్నికల అధికారులు ఎవ్వరు నేతల వద్దకు వచ్చినా ముందుగా వారి వాహనాలు మద్యం, ప్రలోభాలకు గురిచేసే ఇతర వస్తువులు ఏమైనా ఉన్నాయా? అని పరిశీలించి ఫొటోలు, వీడియోలు తీసుకోవాలని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వ్యవహారంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులతోపాటు కార్యకర్తలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరి బెదిరింపులు, దౌర్జన్యాలకు పార్టీ శ్రేణులు భయపడాల్సిన అవసరం లేదన్నారు. తనతోపాటు పార్టీకూడా అండగా ఉంటుందని పేర్కొన్నారు.

వైసీపీకి రూరల్‌లో ఎదురుదెబ్బ
- పద్మావతిపురం మాజీ సర్పంచ్ రాజీనామా
- నేడు నారా లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరిక


మాజీ సర్పంచ్ గణపతి నాయుడు

తిరుచానూరు, ఏప్రిల్ 20: చంద్రగిరి నియోజకవర్గంలో వైసీపీకి ఎదురుదెబ్బ తగిలింది. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురం మాజీ సర్పంచ్ వీరపల్లి గణపతి నాయుడు వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామాచేశారు. గతంలో రూరల్ సర్పంచుల సంఘం అధ్యక్షుడిగాను, రెండు పర్యాయాలు ఉప సర్పంచ్‌గా, ఒక పర్యాయం సర్పంచ్‌గా ఆయన పనిచేశారు. గడచిన రెండు సార్వత్రిక ఎన్నికల్లోనూ చెవిరెడ్డికి అత్యంత నమ్మకస్తుడిగా వైసీపీ కోసం పనిచేసినా గణపతి నాయుడుకు సముచిత స్థానం కల్పించకపోవడంతో కొన్ని రోజులుగా స్తబ్దుగా ఉన్నారు. విలువలు, ఆత్మగౌరవం కోసం వైసీపీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నానని, తనకు జరిగిన అన్యాయంపై ప్రజాక్షేత్రంలోకి వెళ్లి వివరిస్తానని ఆయన చెప్పారు. మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్, తన సతీమణి శ్రీవిద్య కూడా పార్టీకి రాజీనామా చేసినట్లు తెలిపారు. ఇదిలా ఉంటే ఆదివారం మంగళగిరిలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరనున్నారు.

ఆ రోజున ఏం జరిగింది..?
అమ్మవారి ఆలయ పరిచారకుడిపై విజిలెన్స్ విచారణ

తిరుచానూరు, ఏప్రిల్ 20: పద్మావతి అమ్మవారి ఆలయంలో తమిళనాడుకు చెందిన భక్తురాలిపై ఓ పరిచారకుడు అసభ్యంగా ప్రవర్తించిన విషయం వెలుగులోకి వచ్చిన విషయం తెలిసిందే. దీన్ని టీటీడీ ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. దీంతో ఆ రోజున ఆలయంలో ఏం జరిగిందన్న దానిపై విజిలెన్స్ అధికారులు శనివారం విచారణ చేసినట్లు సమాచారం. దీంతోపాటు ఈ పరిచారకుడు గతంలో పనిచేసిన ఆలయాల్లోనూ మహిళా భక్తులతో అసభ్యంగా ప్రవర్తించాడన్న విమర్శలపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది.

టీడీపీని గెలిపించండి...
మామిడి బోర్డు ఏర్పాటు చేస్తాం: పులివర్తి సుధారెడ్డి

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 20: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నానిని గెలిపిస్తే జిల్లాలో మ్యాంగో బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తారని టీడీపీ మహిళా నేత పులివర్తి సుధారెడ్డి హామీ ఇచ్చారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెరబైలు పంచాయతీ బండకాడ కమ్మపల్లె వద్ద ఆమె మీడియాతో మాట్లాడుతూ వైసీపీ దౌర్జన్యాలకు భయపడకుండా మే 13న జరగనున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ నిర్భయంగా టీడీపీకి ఓటేయ్యాలని కోరారు. డబ్బుతో ఓట్లు కొనుగోలు చేసేందుకు వచ్చే వైసీపీ వారికి తగిన బుద్ధి చెప్పాలన్నారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు దేశిరెడ్డి రఘునాథ, కేశవులు నాయుడు, కొమ్మక లక్ష్మీదేవి, కొట్టే సుజాత, కోళ్ల ప్రసాద్, శివ రామిరెడ్డి, సురేంద్ర బాబు, మహేష్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలే మా కుటుంబ సభ్యులు


ప్రచారం చేస్తున్న పులివర్తి వినీల్

తిరుపతిరూరల్, ఏప్రిల్ 20: చంద్రగిరి నియోజకవర్గ ప్రజలే మాకుటుంబ సభ్యులని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని తనయుడు వినీల్ పేర్కొన్నారు. తిరుపతి రూరల్ మండలంలోని ఓటేరు పంచాయతీలో శనివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ తన తండ్రి ఓటమికి కుంగిపోకుండా ఐదేళ్లు ప్రజల్లోనే ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేశారని గుర్తు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి నానితోనే సాధ్యమని, ఒక్క అవకాశం ఇచ్చి ఆయనను గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు.

ఆర్‌సీపురంలో ఇంటింటి ప్రచారం


ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

రామచంద్రాపురం, ఏప్రిల్ 20: చంద్రగిరి టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పులివర్తి నానిని గెలిపించాలని ఆ పార్టీ నాయకులు శనివారం ఆర్‌సీపురం మండలంలో ప్రచార రథాన్ని ప్రారంభించి, ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి మాట్లాడుతూ పులివర్తి నాని విజయం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు జేడీ జగన్, జనార్ధన్ చౌదరి, ఉమాపతి నాయుడు, హరిప్రసాద్, మధుసూదన్‌రెడ్డి, ఢిల్లీనాథరెడ్డి, సురేంద్ర నాయుడు, మండల నాయకులు ప్రసాద్, గిరి నాయుడు, మునిరామిరెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

ఆట.. పాట.. మాట.. పోస్టర్ ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 20: ఒత్తిడి చదువులు, సెల్‌ఫోన్ మహమ్మారి నుంచి పిల్లలను దూరంగా ఉంచుదాం అనే నినాదంతో చిన్నారులకు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నట్లు వేమన విజ్ఞాన కేంద్రం ప్రకటించింది. ఏప్రిల్ 28వ తేదీ నుంచి మే 2వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు శనివారం వారు పోస్టర్ విడుదల చేశారు. మూడు ఆపై తరగతులు చదివే వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చు. ఆసక్తి కలిగిన వారు 9441287530, 7382881567, 9398000686 అనే ఫోన్ నెంబర్లలో సంప్రదించి, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి మల్లారపు నాగార్జున, జన విజ్ఞాన వేదిక నాయకులు టెంకాయల దామోదరం, రాఘవశర్మ, నడ్డినారాయణ, గురునాథం, రెడ్డిప్ప, హేమశేఖర్, ప్రసూన తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు పస్తులేనా..?


నవీన్‌కుమార్‌రెడ్డి

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 20: నగర పాలక సంస్థ కార్మికులు పస్తులు ఉండాల్సిందేనా.. వారికి వెంటనే జీతాలు చెల్లించాలని రాయలసీమ పోరాట సమితి కన్వీనర్ నవీన్‌కుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం ఆయన మాట్లాడుతూ చాలీచాలని జీతాలతో ఆధ్యాత్మిక నగరాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న వెయ్యిమంది పారిశుధ్య కార్మికులకు రెండు నెలలు పూర్తయి మూడో నెల సగం గడిచినా జీతాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

చంద్రగిరి

హనుమంత వాహనంపై
కోదండరాముడు



చంద్రగిరి, ఏప్రిల్ 20: చంద్రగిరిలో వెలసిన కోదండ రామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం సీతారామలక్ష్మ సమేత హనుమంతు ఉత్సవర్లకు కన్నులపండువగా ఊంజల్ సేవ నిర్వహించారు. అనంతరం స్వామి వారు హనుమంత వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునిహరిబాబు, అర్చకుడు శ్రీనివాస భట్టర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంసీఎంసీ కేంద్రం తనిఖీ


కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న వీజీ శేషాద్రి, మీను ఓల

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 20: కలెక్టరేట్‌లోని ఎంసీఎంసీ కంట్రోల్ రూమ్‌ను శనివారం జిల్లా వ్యయ పరిశీలకులు వీజీ శేషాద్రి, మీను ఓల పరిశీలించారు. పలు సూచనలు చేశారు. మీడియానోడల్ అధికారి, ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ బాలకొండయ్య మాట్లాడుతూ ప్రతికల్లో, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో వచ్చే ప్రకటనలను ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నామని వివరించారు. జిల్లా ఎక్స్‌పెండేచర్ నోడల్ అధికారి చరణ్ రుద్రరాజు, డివిజనల్ పీఆర్వో ఈశ్వరమ్మ తదితరులున్నారు.

వైభవంగా మారమ్మ మారయ్య
కల్యాణోత్సవం

ఎర్రావారిపాలెం, ఏప్రిల్ 20: ఎర్రావారిపాలెం గ్రామం బెస్తపల్లెలో వెలసిన బెస్త కులస్తుల దైవం మారమ్మ తిరుణాళ్లలో భాగంగా రెండో రోజైన శనివారం రాత్రి 10గంటలకు ఆలయంలో వేద పండితులు ప్రసన్న స్వామి వేదమంత్రోచ్చరణల మధ్య మారమ్మ మారయ్యల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం అగ్ని గుండం కార్యక్రమం నిర్వహించారు. మారమ్మ జీవిత చరిత్రను బుర్రకథ ద్వారా వినిపించారు. కుల పెద్దలు కృష్ణమూర్తి, అక్కెం వెంకట్రమణ, వజ్రాల సుధాక ర్, చెంగల్‌రాయులు పగడాలు వెంకట్రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు స్వీప్ ర్యాలీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 20: ఓటర్లలో చైతన్యం కోసం ఆదివారం 6గంటలకు ఎంఆర్‌పల్లె సర్కిల్ నుంచి లక్ష్మీపురం వరకు బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు జిల్లా స్వీప్ నోడల్ అధికారి వి.మురళీకృష్ణ శనివారం తెలిపారు. విద్యార్థులు, యువజన సంఘాలు ర్యాలీలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ఎస్పీ కృష్ణకాంత్ పటేల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు.

రేపటిలోపు పోస్టల్ బ్యాలెట్‌కు
దరఖాస్తు చేసుకోవాలి


మాట్లాడుతున్న ఏపీ ఎన్జీవోస్ నేతలు

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 20: ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులు తమ విలువైన ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ఓటు కోసం సోమవారంలోగా దరఖాస్తు చేసుకోవాలని ఏపీ ఎన్జీవోస్ జిల్లా ఉపాధ్యక్షుడు నైనారు వరప్రసాద్ తెలిపారు. రుయాస్పత్రిలో ఆయన శనివారం ఏపీఎన్జీవోస్ నేతలతో కలిసి సమావేశమయ్యారు. ఉద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. నగర కార్యదర్శి బాలాజి, నేతలు చిట్టిబాబు, మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దుష్టశక్తుల నుంచి చంద్రగిరిని కాపాడుకుందాం
- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని

తిరుపతి రూరల్, ఏప్రిల్ 20: పదేళ్లుగా పీడిస్తున్న వైసీపీ దుష్టశక్తుల బారి నుంచి చంద్రగిరిని కాపాడుకునేందుకు ప్రజలు సమాయత్తం కావాలని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని పిలుపునిచ్చారు. తిరుపతి రూరల్‌మండలంలోని వేదాంతపురం పంచాయతీలో శనివారం మీ ఇంటి వద్దకు మీ పులివర్తినాని, బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన చెవిరెడ్డి అరాచక పాలన సాగిస్తూ ప్రశ్నించిన వారిపై దాడులు చేయడంతోపాటు పోలీసు కేసులు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. చెవిరెడ్డి అవినీతి చిట్టాను ఆధారాలతో సహా ప్రజల ముందు ఉంచుతానని, ప్రతి పైసాకు ఎమ్మెల్యే సమాధానం చెప్పాల్సిన సమయం త్వరలోనే వస్తుందని తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో ఏ ఒక్క వర్గానికి న్యాయం జరగలేదని, ప్రజలు కూడా ఈ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. మద్యపాన నిషేధం, ఉద్యోగులకు సీపీఎస్ అమలు, పోలవరం, అమరావతి రాజధాని నిర్మాణాలను అటకెక్కించి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని విమర్శించారు. ఈ రాష్ట్రానికి మరలా పూర్వవైభవం రావాలంటే చంద్రబాబు తిరిగి సీఎంగా రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. నిండు మనసుతో రానున్న ఎన్నికల్లో టీడీపీని ఆశీర్వదిస్తే ప్రజలకు, నియోజకవర్గ అభివృద్ధికి అండగా నిలుస్తానని తెలిపారు. రూరల్‌మండల అధ్యక్షుడు ఎ.ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తున్న పులివర్తి నాని

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

తిరుచానూరు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలను తిరుచానూరు సమీపంలోని రఘునాథ రిసార్ట్స్‌లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. టీడీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈశ్వరరెడ్డి, కృష్ణమూర్తి రెడ్డి, కిలారి వెంకటేశ్, సాల్మన్‌రాజు, రమేష్ తదితరులు పాల్గొన్నారు. పులివర్తి నాని సమక్షంలో శనివారం ఎర్రావారిపాళెం మండలానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. సురేష్, రాంబాబు, గుర్రప్ప, శివయ్య, అరుణ్‌కుమార్ తదితరులున్నారు.


నానికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు

గోవిందరాజ స్వామి ఆలయంలో బుగ్గోత్సవం


స్నపన తిరుమంజనం నిర్వహిస్తున్న అర్చకులు

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 20: శ్రీగోవిందరాజ స్వామి ఆలయంలో శనివారం ఘనంగా బుగ్గోత్సవం నిర్వహించారు. మూడు రోజులు జరిగే ఈ వేడుకలో తొలిరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతం తరువాత స్వామి వారి విశ్వరూప దర్శనం కల్పించారు. అనంతరం ఆలయంలోని బుగ్గ వద్దకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారిని వేంచేపు చేశారు. అక్కడే మధ్యాహ్నం 2.30 గంటలకు ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం, సమర్పణ, ఆస్థానం జరిగింది. సాయంత్రం 5.30 గంటలకు ఉభయ నాంచారులతో కలిసి శ్రీవారి ఊంజల సేవ, అనంతరం బుగ్గవద్దకు ఊరేగింపు నిర్వహించి, భక్తులకు దర్శనం కల్పించారు. తిరిగి సాయంత్రం 6గంటలకు శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయం వద్ద ఆస్థానం జరిగింది. ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి, సూపరింటెండెంట్ మోహన్‌రావు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

మా పొలాన్ని ఆక్రమించేస్తున్నారు!


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న సిద్ధయ్య

భాకరాపేట, ఏప్రిల్ 20: మా పూర్వీకుల నుంచి సంక్రమించిన భూమి ఆక్రమణ కాకుండా కాపాడాలని భాకరాపేటకు చెందిన రైతు సిద్ధయ్య ఎస్ఐ విజయ్‌కుమార్ నాయక్‌కు శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు సిద్ధయ్య మాట్లాడుతూ భాకరాపేట గ్రామ లెక్క దాఖలా సర్వే నెం.329/22లో తనకు 2.40 ఎకరాల పట్టా భూమి ఉందని, ఆ భూమిలో కొంత చదును చేసి మామిడి చెట్లు నాటుకోగా, కొంత బీడుగా ఉందన్నారు. అయితే భాకరాపేట సర్పంచ్ భూపాల్ తమ అనుమతి లేకుండా ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్నాడని, అలా ఎందుకు చేస్తున్నావని ప్రశ్నిస్తే సరైన సమాధానం చెప్పకుండా దాటవేస్తున్నాడన్నారు. తమ అభ్యర్థనల్ని బేఖాతరు చేస్తూ ఆ భూమిని చదును చేసి ప్లాట్లు వేయడానికి భూపాల్ ప్రయత్నం చేస్తున్నాడన్నారు. అతడి వ్యవహారంపై తాము గతంలోనే హైకోర్టును ఆశ్రయించి స్టే పొంది ఉన్నామన్నారు. ఆ భూమికి కంచె కూడా ఏర్పాటు చేశామని, ఇటీవల కొంత మంది అతడి మనుషులు కంచె తొలగించాలని తమను బెదిరిస్తున్నారని, మా భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాడాలని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సిద్ధయ్య తెలిపారు.

రేణిగుంటలో రాత్రి వేళ రిజిస్ట్రేషన్లు!



రాత్రివేళ తెరిచి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం - బయట సిబ్బంది కారు

రేణిగుంట, ఏప్రిల్ 20: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాత్రి వేళ పనిచేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం రాత్రి 11 గంటలు కావస్తున్నా... సిబ్బంది లోపల పనులు చేస్తూ కనిపించారు. ఈ విషయమై కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా సోమవారం కోర్టుకు హాజరుకావలసి ఉందని, ఆదివారం సెలవు కావడంతో ఆ పనులు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే చంద్రగిరి ఎమ్మెల్యే సోదరుడికి సంబంధించిన ఓ రిజిస్ట్రేషన్ జరుగుతోందని సమాచారం. సాయంత్రం 5 గంటల లోపల రిజిస్ట్రేషన్ ముగించి కార్యాలయం మూసివేసి వెళ్లాలి. సర్వర్లు డౌన్ కావడంతో రాత్రి 8.30 గంటల వరకు పనిచేసినట్లు సమాచారం. కాగా, రిజిస్ట్రేషన్ అయిన నెంబర్ కోసం కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వేచి ఉన్నట్టు సమాచారం.

పొలం అమ్మేసిన మాజీ సీఎం కిరణ్

శంకర్‌పల్లి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. జన్వాడలో ఆయనకు 1.20 ఎకరాల భూమి ఉండగా దానిని అమ్మేశారు. ఆ భూమిని కొనుగోలుదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసేందుకు ఆయన తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. అనంతరం హైదరాబాద్ వెళ్లిపోయారు. కాగా, మాజీ సీఎం కిరణ్‌కుమార్ రెడ్డి కార్యాలయానికి వచ్చిన విషయం తెలుసుకున్న చాలా మంది స్థానికులు, నాయకులు కార్యాలయానికి వచ్చి ఆయనతో ఫొటోలు దిగారు.

నవమి ఉత్సవాలకు వచ్చి వెళ్తూ..
రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెళ్లకూరు, ఏప్రిల్ 20: శ్రీరామ నవమి ఉత్సవాలకు స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ ప్రాణాలు కోల్పోయింది, ఆమె భర్త గాయపడ్డాడు. నాయుడుపేట మండలం జువ్వలపాలేనికి చెందిన సుందరరామయ్య ఆమె భార్య మునికుమారి(49) శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నారు. సుందరమరాయ్య శ్రీకాళహస్తి ఆలయంలో కాంట్రక్టర్ ఉద్యోగి, ఆయన భార్య ఆర్టీసీ కండక్టర్. భార్యాభర్తలు ఇటీవల స్వగ్రామంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం శనివారం ఉదయం బైక్‌లో శ్రీకాళహస్తికి తిరిగి పయనమయ్యారు. ఈ క్రమంలో మండలంలోని చెంబేడు క్రాస్ రోడ్డుపై వారిని వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌నుంచి కింద పడిని మునికుమారి తలపై లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుందరరామయ్య గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షార్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ...
60 లక్షలకు టోకరా - పోలీసులకు ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 20: కేంద్రప్రభుత్వ శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ రూ.60 లక్షలకు టోకరా పెట్టిన సంఘటన వెలుగు చూసింది. బాధితుల కథనం మేరకు... నాయుడుపేట పట్టణంలోని మంగపతినాయుడునగర్‌లో నివాసం ఉంటున్న శ్రీనివాసులు రాష్ట్ర ప్రభుత్వశాఖలో కాంట్రాక్ట్ ఉద్యోగి. ఈ క్రమంలో నెల్లూరు నుంచి నాయుడుపేటకు రైలులో వస్తుండగా అభినవరెడ్డి దంపతులు పరిచయమయ్యారు. ఈక్రమంలో కొద్ది రోజుల తరువాత శ్రీహరికోటలో ఉద్యోగాలు ఇప్పిస్తానని శ్రీనివాసులును అభినవరెడ్డి నమ్మబలికాడు. శ్రీనివాసులు మరో ముగ్గురు స్నేహితుల నుంచి దాదాపు రూ.7 లక్షలు అకౌంట్‌లో, నగదు రూపంలో అభినవరెడ్డి ఇచ్చాడు. అదే సమయంలో శ్రీనివాసులు మరో స్నేహితుడిని అభినవరెడ్డికి పరిచయం చేశాడు. ఆ స్నేహితుడు ద్వారా రూ.53 లక్షలు దాకా ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ అభినవరెడ్డి తీసుకున్నాడు. ఈ మేరకు శ్రీనివాసులు నాయుడుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆర్టీసీ బస్టాండులో తిరగని ఫ్యాన్లు
ఉక్కపోతతో ప్రయాణికుల అవస్థలు


పాకాల ఆర్టీసీ బస్టాండులో తిరగని ఫ్యాన్లు

పాకాల, ఏప్రిల్ 20: స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఫ్యాన్లు తిరగకపోవడంతో ప్రయాణికులు ఉక్కపోతతో అవస్థలు పడుతున్నారు. నిత్యం ప్రయాణికులతో రద్దీగా వుండే బస్టాండులో ఫ్యాన్లు వున్నా స్విచ్ ఆన్ చేయకపోవడంతో తరచూ మధ్యాహ్న సమయాల్లో వేచి వున్న ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. బస్టాండు లోపల, ఆవరణను ఆధునీకరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.





పాకాల టీడీపీ కార్యాలయంలో, భాకరాపేటలో, రామచంద్రాపురంలో, ఎస్వీయూనివర్సిటీ గేటు వద్ద కేకు కట్ చేస్తున్న నాయకులు

ఘనంగా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

టీడీపీ అధినేత చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను పార్టీ శ్రేణులు శనివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. పలుచోట్ల కేక్ కట్‌చేశారు. చంద్రబాబు ఆరోగ్యంగా ఉండాలని తిరుమలలో శ్రీవారికి కొబ్బరికాయలు సమర్పించారు.




చంద్రగిరిలో, శానంబట్లలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు - తిరుమలేశుడికి కొబ్బరికాయలు సమర్పిస్తున్న శ్రీధర్‌వర్మ తదితరులు

తిరుమలలో నేటినుంచి వసంతోత్సవాలు

తిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి సాలకట్ల వసంతోత్సవాలకు తిరుమలలోని వసంతమండపం సిద్ధమయ్యింది. ఆదివారం నుంచి మూడ్రోజులపాటు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. ప్రతి ఏడాది చైత్ర శుద్ధ పౌర్ణమికి ముగిసేటట్లుగా వసంతోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 6.30 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామి నాలుగు మాడవీధుల్లో ఊరేగుతారు. తర్వాత వసంతమండపానికి వేంచేపు చేస్తారు. అక్కడ వసంతోత్సవ అభిషేక నివేదనలు పూర్తయ్యాక ఆలయానికి చేరుకుంటారు. రెండో రోజున ఉదయం 8 నుంచి 10 గంటల మధ్య స్వర్ణరథంలో ఉత్సవమూర్తులు దర్శనమిస్తారు. తర్వాత యథావిధిగా వసంతమండపంలో వసంతోత్సవాన్ని నిర్వహిస్తారు. చివరిరోజున మలయప్పస్వామితోపాటు సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామి, రుక్మిణి సమేత శ్రీకృష్ణస్వామి ఉత్సవమూర్తులను కూడా వసంతమండపంలో కొలువుదీర్చి వసంతోత్సవం నిర్వహిస్తారు. ఈ మూడ్రోజులు మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సాయంత్రం ఆరు గంటలకు ఆస్థానం ఉంటుంది. ఈక్రమంలో వసంతమండపంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. అచ్చం అడవిలో ఉండేలా సెట్టింగులు వేశారు.


సిద్ధమైన వసంతమండపం

ముగ్గురు అబ్జర్వర్ల నియామకం

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 20: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అభ్యర్థుల ఖర్చులు, ఎన్నికల ఉల్లంఘనలపై నిఘా ఉంచడానికి కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు అబ్జర్వర్లను నియమించింది. తిరుపతి పార్లమెంట్‌కు ప్రదీప్ కుమార్ (9032666742), చంద్రగిరి తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాలకు వ్యయపరిశీలకులుగా వీజీ శేషాద్రి (6281870157), గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలకు వ్యయపరిశీలకులుగా మీను ఓల (9912340492) నియమితులయ్యారు. అభ్యర్థుల ఖర్చులపై ఫిర్యాదులను వీరికి చేయొచ్చు.

తాగునీటి సమస్యపై ప్రత్యేక దృష్టి: జడ్పీ ఛైర్మన్

చిత్తూరు రూరల్ ఏప్రిల్ 20: జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. శనివారం జడ్పీ చాంబర్‌లో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉంటే పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు అడుగంటిన ప్రాంతాల్లో ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. ఎండలు మండిపోతున్న తరుణంలో వైద్యశాఖ అప్రమత్తంగా ఉండాలన్నారు. వృద్ధులు, చంటి పిల్లలు, గర్భిణులు వడదెబ్బకు గురికాకుండా ప్రత్యేక దృష్టి సారించాలనిపేర్కొన్నారు. జడ్పీ సీఈవో గ్లోరియా, జడ్పీ వైస్ ఛైర్మన్లు ధనంజయరెడ్డి, రమ్య, డీఎంహెచ్‌వో రవిరాజు, జడ్పీటీసీలు, అధికారులు పాల్గొన్నారు.

తిరుపతి

వైసీపీ నుంచి టీడీపీలోకి వలసల వెల్లువ




చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిన 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా సంధ్య, మాజీ కౌన్సిలర్ హేమంత్‌కుమార్ యాదవ్

తిరుపతి (జీవకోన), ఏప్రిల్ 20: తిరుపతి వైసీపీ నుంచి టీడీపీకి వలసలు మొదలయ్యాయి. శనివారం గూడూరులో జీవకోనకు చెందిన మాజీ సర్పంచ్ అన్నా రామకృష్ణ యాదవ్ కుటుంబంతోపాటు పలువురు చంద్రబాబు సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరిలో.. జీవకోన మాజీ సర్పంచ్ అన్నా మల్లీశ్వరి, 48వ డివిజన్ కార్పొరేటర్ అన్నా అనిత, 49వ డివిజన్ కార్పొరేటర్ అన్నా సంధ్య, పాల ఏకరి సంఘం తిరుపతి జిల్లా అధ్యక్షుడు గోళ్ల మధుసూదన్ నాయుడు, మాజీ సింగిల్ విండో చైర్మన్ శివశంకర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు శేఖర్ యాదవ్, వెంకటేష్ యాదవ్, చిరంజీవితోపాటు అన్నా నారాయణ, బుజ్జమ్మ నాయుడు, సుబ్బు, శివా యాదవ్, వెంకటేష్ రెడ్డి, తదితరులున్నారు. అదేవిధంగా తిరుపతిలోని ప్రముఖ యాదవ సంఘం నాయకులు, మాజీ కౌన్సిలర్ హేమంత్ కుమార్ యాదవ్, టౌన్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ కట్టా జయరాం యాదవ్, మాజీ పెద్ద గంగమ్మ గుడి చైర్మన్ వెంకటాద్రి, వెంకటేష్, జస్వంత్, మోబిన్, సాయి, వేణు, నాగేశ్వరరావు, శరత్ రాయల్, హిమబిందు, బాలాజి, రాజేష్, రవీంద్ర, గురవయ్యలతోపాటు 37వ డివిజన్‌కు చెందిన వైసీపీ నాయకులు కుమార్‌రెడ్డి, మునేశ్వరయ్య, ముని కుమార్, చంద్రశేఖర్, వెంకటేష్, వెంకటాద్రి, కె.వెంకటేష్, జీవరత్నం, బాలాజి, రాజేష్, సుబ్బరత్న, మునీశ్వరి, రేఖలు కూడా టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో తిరుపతి పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ పాల్గొన్నారు.

సీపీఐ అభ్యర్థి నామినేషన్‌కు నారాయణ హాజరు



ర్యాలీలో పాల్గొన్న నారాయణ తదితరులు

తిరుపతి (ఆటోనగర్), ఏప్రిల్ 20: తిరుపతి అసెంబ్లీ అభ్యర్థిగా ఇండియా కూటమి తరపున పి.మురళి (సీపీఐ) శనివారం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమంలో సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుడి పేరు చెప్పుకుని గెలవాలనుకునే వారిని ప్రజలు ఓడించాలని పిలుపునిచ్చారు.దేశంలో ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడానికి కుట్ర పన్నుతున్న బీజేపీని ప్రజలు క్షమించరన్నారు. ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. అంతకుముందు బైరాగిపట్టెడ పద్మావతి పార్కు నుంచి అన్నమయ్య కూడలి వరకు సీపీఐ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. నాయకులు రమాదేవి, మాంగాటి గోపాల్ రెడ్డి, హరినాథరెడ్డి, రామానాయుడు, విశ్వనాథ్, వి.నాగరాజు, కందారపు మురళి, సుబ్రహ్మణ్యం, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైసీపీని ఓడించడానికి మేం సిద్ధం: ఎన్డీయే కూటమి

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 20: రాష్ట్రాన్ని ఐదేళ్లపాటు దోచుకున్న వైసీపీని ఓడించడానికి మేం సిద్ధంగా ఉన్నామని ఎన్డీయే కూటమి నాయకులు స్పష్టం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం తిరుపతి రైల్వే స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా ఆధునీకరించి అభివృద్ధి చేస్తోందని చెప్పారు. జగన్ పాలనలో అభివృద్ధి చెందింది ఎమ్మెల్యే భూమన కుటుంబం ఒక్కటేనని చెప్పారు. నాయకులు ఆముదాల తులసీరాం, కరాటే చంద్ర, ఆనంద్, కె.అజయ్‌కుమార్, వరప్రసాద్ పాల్గొన్నారు.

తిరుమలేశుడి సేవలో ప్రముఖులు




కుటుంబీకులతో వీవీఎస్ లక్ష్మణ్ - హీరోయిన్ సంయుక్త మీనన్

తిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ఇండియన్ మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్, తెలంగాణ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎన్నికల అబ్జర్వర్ వీజీ శేషాద్రి, మాజీ డీజీపీ ఆర్పీ ఠాకూర్, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్రారెడ్డి ఉన్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. అలాగే బింబిసార, సార్, విరూపాక్ష వంటి చిత్రాలతో మంచి విజయాలను అందుకున్న హీరోయిన్ సంయుక్త మీనన్ కూడా శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయం ముందు ఆమె మీడియాతో మాట్లాడుతూ.. మంచి దర్శనం లభించిందని సంతోషం వ్యక్తం చేశారు. ప్రస్తుతం మూడు చిత్రాల్లో నటిస్తున్నట్టు తెలిపారు. శర్వానంద్‌తో ఓ సినిమాలో యాక్ట్ చేస్తున్నానన్నారు. అలాగే 'స్వయంభు' అనే చిత్రం కూడా షూటింగ్ జరుగుతోందన్నారు.

శాస్త్రవేత్తలుగా విద్యార్థులు రాణించాలి



తిరుపతి(విద్య), ఏప్రిల్ 20: విద్యార్థులు భవిష్యత్తులో శాస్త్రవేత్తలుగా రాణించాలని పద్మావతి మహిళా వర్సిటీ ఫిజిక్స్ విభాగాధిపతి కృష్ణయ్య పిలుపునిచ్చారు. అమెరికా నాసా స్పేస్ సెటిల్మెంట్ నిర్వహించిన పరీక్షల్లో శ్రీచైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థినులు ఉత్తమ ప్రతిభ చూపి, బహుమతులు గెలుపొందారు. ఆ విద్యార్థినులకు అభినందన కార్యక్రమం ప్రిన్సిపాల్ రాధికారాజ్ ఆధ్వర్యంలో శనివారం పాఠశాలలో జరిగింది. పాఠశాల డీన్ పురుషోత్తం, ఏజీఎం సురేష్, నాసా పోటీల ఇన్‌చార్జి గౌసియా, టీచర్లు పాల్గొన్నారు.

జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి



మస్తాన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న రమాదేవి

తిరుపతి(విద్య), ఏప్రిల్ 20: విద్యార్థులు జంక్ ఫుడ్‌కు దూరంగా ఉండాలని ఎస్వీఐసీసీఏఆర్ హాస్పిటల్‌కు చెందిన డాక్టర్ మస్తాన్‌బాషా సూచించారు. యశోదనగర్‌లోని లిటిల్ ఏంజెల్స్ పాఠశాలలో క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. హ్యూమన్ ప్యాపిల్ నోమా వాక్సినేషన్ (హెచ్‌పీవీ)పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల చైర్‌పర్సన్ ఎం.రమాదేవి, ప్రిన్సిపాల్ వై.పద్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గంగమ్మ జాతర వాయిదా

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 20: తిరుపతి గంగమ్మ జాతరను వాయిదా పడింది. ఈ మేరకు ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) మమత సంబంధిత వర్గాలకు సమాచారం ఇచ్చారు. శనివారం సాయంత్రం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ (ఏసీ) రామకృష్ణారెడ్డితో కలిసి మీడియాకు వివరాలు తెలిపారు. ఎన్నికల కారణంగా జాతర వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. దీనిపై దేవాలయ పూజారి రామకృష్ణ శాస్త్రి ద్వారా పండితులతోపాటు అవిలాల రెడ్లు, కైకాల వంశస్తులు, నాయీబ్రాహ్మణులతో కూడా సంప్రదించి, అందరి సలహా మేరకు మే 14వ తేదీన జరగాల్సిన జాతరను మే 22వ తేదీకి మార్చినట్టు తెలియజేశారు.

అయితే అవిలాల జాతర తర్వాత తిరుపతి జాతర చాటింపు ఉంటుంది. మరి దఫా అవిలాల జాతర కూడా వాయిదా వేశారా.. అన్న ప్రశ్నకు తమకు తెలియదన్నారు. ఇదిలా ఉంటే.. జాతర వాయిదా వేయడాన్ని ప్రతిపక్ష నాయకులు తప్పుపడుతున్నారు.

● అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమిస్తాం

వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి జాతర ఇష్టారాజ్యంగా జరుగుతోంది. సొంత వ్యవహారంగా మార్చేశారు. ఎన్నికల కోడ్ ఉన్నపుడే రంజాన్, శ్రీరామనవమి జరిగాయి.. జాతరకు మాత్రం ఇబ్బందేమిటి? వాయిదా నిర్ణయం మారకుంటే, అన్ని వర్గాలను ఏకం చేసి ఉద్యమిస్తాం. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీ మరోమారు ఆలోచన చేయాలి.

- ఆర్సీ మునికృష్ణ (టీడీపీ), గంగమ్మ ఆలయ మాజీ చైర్మన్

● ఇది సంప్రదాయ విరుద్ధం

జాతర వాయిదా అన్నది సంప్రదాయ విరుద్ధం. జాతరతో సంబంధం ఉన్న అనేక కులాలు, భక్తుల మనోభావాలు తెలుసుకోకుండా ఏకపక్షంగా వాయిదా వేయడం దారుణం. ఇలాగే ఎన్నికల పేరుతో శ్రీవారి బ్రహ్మోత్సవాలను కూడా వాయిదా వేయగలరా? పూజాదికాలను ఏకాంతంగా జరిపించే వీలున్నపుడు వాయిదా వేయడం మంచి పద్ధతి కాదు.

- నవీన్ కుమార్ రెడ్డి (కాంగ్రెస్)

తిరుపతి అభివృద్ధికి కృషి చేస్తా: ఆరణి

తిరుపతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు హామీ ఇచ్చారు. ఇంటింటిప్రచారంలో భాగంగా టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి సూరా సుధాకర్ రెడ్డి నేతృత్వంలో శనివారం 19,20,21,22 డివిజన్లలో పర్యటించారు. టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదినం సందర్భంగా ఎస్వీ నగర్లో ఆరణి.. కేక్‌కట్ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఐదేళ్ల వైసీపీ పాలనలో తిరుపతి అక్రమాలకు కేంద్రంగా మారిందని ఆరోపించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని తండ్రీకొడుకులైన కరుణాకరరెడ్డి, అభినయ్‌రెడ్డి సొంత ఆస్తులను పెంచుకున్నారని విమర్శించారు. టీడీపీ నేతలు ఆర్సీ మునికృష్ణ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, చినబాబు, పాటకం వెంకటేష్, మహేష్ యాదవ్, రుద్రకోటి సదాశివం, ఆనంద్ గౌడ్, ఆముదాల తులసీరాం, బీజేపీ నాయకులు భానుప్రకాష్ రెడ్డి, అజయ్ కుమార్, పొనగంటి భాస్కర్, వరప్రసాద్, జనసేన నాయకులు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, లక్ష్మీపతి రాయల్, ఆకేపాటి సుభాషిణి పాల్గొన్నారు.

ఆరణి బీఫామ్ తిరుపతి నేతలకు అందజేసిన పవన్

● గెలుపు బాధ్యత జనసేన నేతలపై మోపిన అధినేత



తిరుపతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అసెంబ్లీ జనసేన-టీడీపీ-బీజేపీ కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు బీఫామ్‌ను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ తిరుపతి పార్టీ నేతలకు అందజేశారు. అభ్యర్థి గెలుపు బాధ్యతను వారిపైనే మోపుతున్నట్టు చెప్పారు. దీనివెనుక ఆసక్తికరమైన పరిణామాలు జరిగాయి. వాస్తవానికి అభ్యర్థి ఆరణికి ఇదివరకే అధినేత బీఫామ్ అందజేశారు. అయితే తిరుపతిలో జనసేన నేతలు ఎన్నికల్లో సీరియస్‌గా పనిచేస్తారో చేయరోనన్న అనుమానం అధినేతలో తలెత్తినట్టు తెలిసింది. దీంతో శుక్రవారం రాత్రి తిరుపతి అసెంబ్లీ ఇన్‌చార్జి కిరణ్ రాయల్, నగర అధ్యక్షుడు రాజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్, నాయకులు పొలకల మల్లి, హరిశంకర్‌లకు పార్టీ కార్యాలయం నుంచి ఫోన్లు వెళ్లారు. శనివారం మధ్యాహ్నానికి పిఠాపురం వెళ్లి అధినేతను కలవాలన్నది సారాంశం. అభ్యర్థి మార్పు ఉంటుందా..? ఇంకేమైనా విషయం ఉందా? అనుకుంటూ తిరుపతి నేతలు హుటాహుటిన బయల్దేరి పిఠాపురంలో వాలిపోయారు. రాత్రి 10.30గంటలకు అధినేతను కలిశారు. అప్పటికి అభ్యర్థి శ్రీనివాసులు కుమారుడు జగన్ కూడా అక్కడికి చేరుకున్నారు. ఆరణికి సంబంధించిన బీఫామ్‌ను తిరుపతి నేతల చేతుల్లో పెట్టిన పవన్.. అభ్యర్థిని గెలిపించే బాధ్యత మీదేనని తేల్చేశారు. లోకల్-నాన్ లోకల్ అంటూ కిరణ్ రాయల్ పలు అభ్యంతరాలు చెప్పినా అధినేత వినిపించుకోలేదు. అదే సమయంలో పిఠాపురం పిలిపించి.. తమకు ప్రాధాన్యం ఇచ్చిన తీరుపై సంతృప్తితో నేతలు వెనుదిరిగినట్టు సమాచారం. కాగా, ఆరణి శ్రీనివాసులు ఈనెల 23వ తేదీన ఉదయం నగరంలో భారీగా ర్యాలీ నిర్వహించి, నామినేషన్ దాఖలు చేయనున్నట్టు తెలిసింది.

'గులక రాయి ఘటనలో వడ్డెర్లను బలిపశువులను చేయొద్దు'



సమావేశంలో మాట్లాడుతున్న వడ్డెర సంఘం నాయకులు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 20: సీఎం జగన్‌పై జరిగిన గులక రాయి ఘటనలో వడ్డెర్లను బలి పశువులను చేయొద్దని వడ్డెర సాధికార సమితి పార్లమెంట్ కమిటీ కన్వీనర్ కె.శ్రీరాములు విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. తమ కులం వారి పిల్లలు సతీష్, దుర్గారావులతో పాటు మరో నలుగురిపై కేసులు పెట్టడం అన్యాయమన్నారు. వడ్డెరలపై కేసులు నమోదు చేసిన వారికి, వైసీపీ ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో వడ్డెరలు తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కమిటీ నేతలు రమణ, కుమార్, విజయ్, సురేష్, బాలాజి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలపై సమష్టి పర్యవేక్షణ అవసరం

● సెబ్, ఎక్సైజ్, పోలీసుశాఖ సమావేశంలో ఎస్పీ



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎస్పీ కృష్ణ కాంత్ పటేల్

తిరుపతి (నేరవిభాగం), ఏప్రిల్ 20: ఎన్నికల నేపథ్యంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లపై సమష్టి పర్యవేక్షణ అవసరమని ఎస్పీ కృష్ణకాంత్‌పటేల్ ఆదేశించారు. తన క్యాంపు కార్యాలయంలో శనివారం సెబ్, ఎక్సైజ్, పోలీసుశాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. తరచూ తనిఖీలు చేసి, నిబంధనలకు విరుద్ధంగా మద్యం విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. అక్రమ విక్రయాలు జరగకుండా వాహనాలకు జీపీఎస్ అమర్చాలని సూచించారు. ఇప్పటివరకు మద్యం దుకాణాల్లో అక్రమాలకు పాల్పడిన 15 మంది సూపర్‌వైజర్లు, సేల్స్‌మేన్‌లను తొలగించి తొమ్మిది కేసులు నమోదు చేసినట్లు సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర వివరించారు.

మహిళా వర్సిటీకి రూ.40.22లక్షల గ్రాంటు మంజూరు



ధ్రువపత్రాలు చూపుతున్న వీసీ, ఆచార్యులు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు) ఏప్రిల్ 20: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి డీఆర్‌డీవో, రక్షణ మంత్రిత్వశాఖల నుంచి రూ.40.22 లక్షల విలువైన పరిశోధనా గ్రాంటు మంజూరైంది. వర్సిటీకి చెందిన ప్రధాన పరిశోధకురాలు ఆచార్య వి.ఉమామహేశ్వరి, డాక్టర్ వి.కళారాణి సారథ్యంలో ఈ పరిశోధన జరుగుతోంది. ఆచార్య ఎన్.రజని, ఆచార్య ఆర్.ఉష సారథ్యంలోని ఆహారసంరక్షణ ప్రోత్సహించే నోవల్ నేచురల్ యాంటీమైక్రోబయాలజీ అభివృద్ధి పరిశోధనకు నిధులను వినియోగిస్తారు. గ్రాంటు రావడానికి కృషిచేసిన ఆచార్యులను వీసీ డి.భారతి శనివారం అభినందించారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.53కోట్లు లభించింది. గురువారం ఉదయంనుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఆదాయాన్ని శనివారం ప్రకటించింది. శుక్రవారం 60,517 మంది స్వామిని దర్శించుకోగా, 27,788మంది తలనీలాలు సమర్పించారు.

వైసీపీ ఓ డ్రామా కంపెనీ

● తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు



వరప్రసాద్‌ను సభకు పరిచయం చేస్తున్న చంద్రబాబు

గూడూరు అర్బన్/ సర్వేపల్లి/ సత్యవేడు, ఏప్రిల్ 20: మానవత్వంలేని జగన్ సారథ్యంలోని వైసీపీ ఓ డ్రామా కంపెనీగా తయారైందని ఉమ్మడి పార్టీల తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు అభివర్ణించారు. శనివారం చంద్రబాబు సారథ్యంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ముందుగా ప్రసంగించిన వరప్రసాద రావు జగన్‌పై విరుచుకుపడ్డారు. చేదు తరువాత తీపి తెలుస్తుందని 12 ఏళ్ల వైసీపీలో తన ప్రయాణంలో చేదేదో తీపేదో తెలిసిందన్నారు. మానవత్వంలేని నాయకుడిగా జగన్‌ను విమర్శిస్తూ తాను దళితుడన్న కారణంతోనే చిన్నచూపు చూసి ఈ ఐదేళ్లల్లో ఎమ్మెల్యేగా వున్న తనను గూడూరులో ముప్పతిప్పలు పెట్టారని విమర్శించారు. జగన్ మాటలకు చేతలకు ఎంతో తేడా ఉందని ఆయననలో నిలువెత్తు అవినీతి, అహంకారం నిండిపోయాయని చంద్రబాబు ఒక్కడే ఆయనకు గుణపాఠం చెప్ప గలరని ఘాటుగా వివర్శించారు. చిల్లకూరు సిలికాను, స్వర్ణముఖిలో ఇసుకను దోచుకుని తాడేపల్లి ప్యాలస్‌లో దాచుకున్నారన్నారు. చెల్లికి న్యాయం చేయలేని, తల్లికి గౌరవం ఇవ్వలేని నాయకుడు ప్రజలకు ఏమి చేస్తాడని సూటిగా ప్రశ్నించారు.



జన్మదినం సందర్భంగా వరప్రసాద్ సమక్షంలో కేక్ కట్ చేస్తున్న చంద్రబాబు

తిరుపతి ఎంపీ ఉమ్మడి అభ్యర్థికి మద్దతివ్వండి

తిరుపతి(ఉపాధ్యాయనగర్): తిరుపతి ఎంపీ స్థానానికి పోటీ చేస్తున్న వెలగపల్లి వరప్రసాద్‌రావుకు మద్దతు తెలపాలని ఆయన సతీమణి లక్ష్మి తిరుపతి కోఆపరేటివ్ బ్యాంక్ మాజీ డైరెక్టర్ భువన్‌కుమార్‌రెడ్డిని అభ్యర్థించారు. మాజీ ఎంపీ వరప్రసాద్ బీజేపీ, టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా తిరుపతి స్థానానికి పోటీ చేసుకున్న విషయం తెలిసిందే. శనివారం ఆమె తిరుపతిలోని భువన్‌కుమార్‌రెడ్డి ఇంటికివెళ్లి ఈ మేరకు అభ్యర్థించారు.





9 కార్ల రోజా

ఎంత ఎమ్మెల్యే అయితే మాత్రం అన్ని కార్లు అవసరమా ఆయమ్మకి? అనే మాటలు నగరి నియోజకవర్గంలో జోరుగా వినిపిస్తున్నాయి. నామినేషన్‌తో పాటూ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌లో మంత్రి ఆర్కే రోజా తనకు 9 కార్లున్నట్టు పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఆమె 6 కార్లున్నట్టు చూపగా ఈసారి మరో మూడు కలిపారు. జగన్ నవరత్నాలకు దీటుగా నవకార్లు సొంతం చేసుకున్నారని జనం మాటల్లో వినిపిస్తోంది. ఈ నవకార్లలో కోటికి పైగా విలువ చేసే బెంజ్ కారు కూడా ఉండడం విశేషం. ఈ కారు కొన్నపుడు ఆమె మీద విమర్శలు కూడా వైరల్ అయ్యాయి. హోండా పల్సర్ బైక్ కూడా రోజా ఆస్తుల్లో చూపారు. 2019లో గెలిచాక ఆస్తులు కూడా బాగానే కొన్నారే మంత్రిగారు అనే మాటలూ సాగుతున్నాయి. నగరి మండలం కీలపట్టు, వీరకావేరిరాజపురం, విజయపురం మండలంలోని పాతార్కాడులో 6.39 ఎకరాల వ్యవసాయ భూమి, భర్త సెల్వమణి నగరిలో 0.94 ఎకరాల వ్యవసాయ భూమి వీరికి ఉంది. అలాగే తెలంగాణలోని గచ్చిబౌలి, పుత్తూరులో ఇంటి స్థలాలు, భర్త సెల్వమణి పేరిట నగరిలో మూడు ఇంటి స్థలాలు కొనుగోలు చేసినట్లు చూపించారు. జగన్ ప్రభుత్వం పోరాడుతున్న మార్గదర్శిలోనూ రోజాకు దాదాపు రూ.40లక్షల చిట్ ఉండడం కూడా జనం మాటల్లో దొర్లుతోంది.

- పుత్తూరు అర్బన్

కుయ్యో మొర్రో..

బాబ్బాబ్బాబ్బాబూ.. అంటూ అధికారపార్టీవారు ఆ నాయకుల వెంటపడుతున్నారు. చీకటి పడ్డాక వారి ఇళ్ల వద్దకు చేరుకుంటున్నారు. 'నిజమేనబ్బా.. మీకు తగిన ప్రాధాన్యం ఇవ్వలేకపోయా.. తప్పయి పోయింది. ఈసారి గెలిస్తే మీకేం కావాలంటే అది చేసుకోవచ్చు. ఈ ఎన్నికల్లో సహకరించండి' అని గెడ్డాలు పట్టుకుని బతిమాలుతున్నారు. శ్రీకాళహస్తిలో అధికార వైసీపీ వారి ఈ అవస్థలు చూసి పలువురు నవ్వుకుంటున్నారు. రకరకాల కారణాలతో పట్టణంలో పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న వారినీ, తటస్థంగా ఉండే ప్రముఖులను కూడా ఇలాగే ప్రాధేయపడుతున్నారు. రాత్రి పది గంటల నుంచి ఈ బుజ్జగింపుల పర్వం మొదలవుతోంది. అర్ధరాత్రి దాటినా కొనసాగుతూ ఉంటుంది. ఈ అర్ధరాత్రి అవస్థలు చూసిన స్థానికులు ఉదయం టీ దుకాణాల దగ్గర వీటిని చర్చకు పెడుతున్నారు. 'చేతులు కాలాక ఆకులు పట్టుకుంటే ఎట్టబ్బా.. పార్టీ మూడొంతులు ఖాళీ అయిపోయాక మేల్కొన్నారు గదా మనోళ్లు' అని ఆ పార్టీ వాళ్లే అనుకుంటున్నారు.

- శ్రీకాళహస్తి



జన కేతనం




www.andhrajyothy.com

నాయకుడికి దూరచూపు ఉండాలి. అభివృద్ధికి అర్థం తెలియాలి. విజన్ కొరవడిన పాలన వర్తమానంలో కూరుకుపోతుంది. భవిష్యత్ తరాలకు ద్రోహం జరుగుతుంది. అభివృద్ధి అంటే ఓట్లలెక్కలు కాదు. అభివృద్ధి అంటే కరెంటు ఛార్జీలు పెంచి, పన్నులు పెంచి, ధరలు పెంచి, మద్యం ఏరుల్లా పారించి... ఎడాపెడా బాదేసి సంక్షేమం అంటూ నగదు విదిల్చడం కాదు. అభివృద్ధి అంటే చదువుల పందిరి వేయడం. అభివృద్ధి అంటే ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం. అభివృద్ధి అంటే ఉపాధికి బాటలు పరవడం.. మరి ఒక్క ఛాన్స్‌తో గద్దెనెక్కిన జగన్‌రెడ్డి చేసిందేమిటి? పాదయాత్రలో జిల్లా పారిశ్రామికాభివృద్ధిపై చెప్పిన మాటలన్నీ ఆచరణలో అమలయ్యాయా? అంతకుముందు అధికారంలో ఉన్న చంద్రబాబు ఏం చేశారు? జిల్లా పారిశ్రామిక చిత్రపటంలో ఈ ఇద్దరు నేతల ముద్రలేమిటో చూద్దాం...

తిరుపతి, ఆంధ్రజ్యోతి

జిల్లా పారిశ్రామిక చిత్రపటం



విజన్ ఉన్న నాయకుడిగా చంద్రబాబుకు ఉన్న పేరు 2014-19 నడుమ నిజం అని రుజువైంది. విభజన తర్వాత రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టిన ఆయన జిల్లా అభివృద్ధికి పారిశ్రామిక రంగాన్ని ఎంచుకున్నారు. ఫలితం.. ఆ ఐదేళ్లలో దేశ, విదేశీ, బహుళ జాతి కంపెనీలెన్నో జిల్లాలో కొలువు దీరాయి. రూ. వేల కోట్ల పెట్టుబడులు ప్రవహించాయి. 2014-19 నడుమ 50 వేల మందికిపైగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించాయి. ఆయా ప్రాంతాల్లో భూముల ధరలు పెరిగాయి. ప్రజల జీవన ప్రమాణాలూ వృద్ధి చెందాయి.

2014-19 చంద్రబాబు హయాంలో

వెలుగులు

- ఏర్పేడు మండలం పాగాలి వద్ద రాక్‌మెన్ ప్లైవుడ్ పరిశ్రమ, ప్రకాష్ స్టీల్స్ ఫెర్రో కంపెనీలు, ఓస్వీన్ వుడ్ ప్యానెల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర పరిశ్రమలు ఏర్పాటయ్యాయి.
- తొట్టంబేడు మండలంలో గ్రీన్ ప్యానెల్, కజారియా టైల్స్, అక్సారా పరిశ్రమలు వచ్చాయి.
- నాయుడుపేట మండలం మేనకూరు సెజ్‌లో ప్రైమ్ ఎలక్ట్రికల్స్, అరబిందో ఫార్మా, జెల్ క్యాప్స్ యూనిట్లు ఏర్పాటయ్యాయి. ఒక జెల్ క్యాప్స్ కంపెనీ ద్వారానే సుమారు 10 వేల మందికి ఉపాధి దక్కుతోంది.
- తడ మండలం మాంబట్టులో ఇండజ్ కాఫీ, టాటా కెమికల్స్, మ్యాక్స్ కింగ్ పరిశ్రమలు, సూళ్లూరుపేటలో తారకేశ్వర టెక్స్‌టైల్స్ పార్క్ స్థాపితమయ్యాయి. ఈ మండలంలోనూ పది వేల మందికి ఉద్యోగావకాశాలు లభించాయి.
- సత్యవేడు మండలంలో హీరో మోటార్స్, వరదయ్యపాలెం మండలంలో కాంటినెంటల్ కాఫీ, అపోలో టైర్స్ వంటి ప్రతిష్టాత్మక పరిశ్రమలు వచ్చాయి. ఈ మూడింటిలోనే పది వేల మందికి ఉద్యోగాలు దొరికాయి. సత్యవేడు, శ్రీకాళహస్తి, నగరి, సూళ్లూరుపేట నియోజకవర్గాల యువత ఈ పరిశ్రమలతో లబ్ధి పొందుతున్నారు.





ఎలక్ట్రానిక్ హబ్

తిరుపతికి పుణ్యక్షేత్రంగానే కాకుండా ఎలక్ట్రానిక్ హబ్‌గా కూడా పేరు తేవాలని చంద్రబాబు ఉబలాటపడ్డారు. విమానాశ్రయానికి చేరువగా ఏర్పేడు, రేణిగుంట మండలాల్లో ఎలక్ట్రానిక్ మానుఫ్యాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేయించారు. ప్రఖ్యాతి గాంచిన పరిశ్రమలు వచ్చేలా చొరవ చూపారు. డిక్సన్, సెల్‌కాన్, టీసీఎల్, కార్బన్, టెల్ లింక్స్, సన్నీ ఆప్‌టెక్, ఫాక్స్‌లింక్, సెవెన్ హిల్స్ డిజిటల్ పార్క్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ యూనిట్లు వెలిశాయి. వాటన్నింటికీ ఆయనే శంకుస్థాపన-ప్రారంభోత్సవాలు చేశారు. ఈఎంసీ-1లోనే 13,851 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. తర్వాత నెలకొల్పిన ఈఎంసీ-2 ఇదే రీతిలో అభివృద్ధి చేశారు. ఈ రెండు క్లస్టర్ల నిర్వహణ కోసమే విమానాశ్రయం వద్ద ప్రత్యేకంగా కార్యాలయం ఏర్పాటు చేసి ఐఏఎస్ అధికారిని సీఈవోగా నియమించారు.





2019-24 జగన్ పాలనలో

చీకట్లు

2019 ఎన్నికల్లో గెలిచి జగన్‌రెడ్డి సీఎం అయ్యారు. అప్పటి దాకా పనులు మొదలు పెట్టని పరిశ్రమల యాజమాన్యాలన్నీ హడావిడిగా నిర్ణయాలు మార్చుకున్నాయి. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటు ప్రతిపాదనలను విరమించుకున్నాయి. కొత్త ప్రతిపాదనలూ లేవు. ఉన్నవి తప్పితే అదనంగా ఒక్క పరిశ్రమ కూడా జిల్లాకు రాలేదు. అనేక పరిశ్రమలు విస్తరణను విరమించుకున్నాయి. రిలయన్స్ జియో వెనక్కి వెళ్లింది. అమరరాజ పొరుగు రాష్ట్రాలకు పారిపోయింది. జగన్‌రెడ్డి ప్రభుత్వం పాలనా తీరుకు కొలబద్దగా జిల్లాలో పారిశ్రామికాభివృద్ధి స్తంభించిపోయింది.

ప్రతిపక్ష నేతగా ఏం చెప్పారు?

2018 జనవరి 21న పాదయాత్రలో భాగంగా శ్రీకాళహస్తికి వచ్చారు. తాను అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానని, ఆ ప్రాంత నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు దొరికేలా చూస్తానని హామీ ఇచ్చారు.

సీఎంగా ఏం చేశారు?

2019 జూన్‌లో అధికారంలోకి వచ్చాక ఇప్పటి వరకూ ఒక్కటంటే పరిశ్రమ కూడా శ్రీకాళహస్తి, ఏర్పేడు, తొట్టంబేడు మండలాల్లో ఏర్పాటు చేయలేదు. జిల్లాలో ఎక్కడా కొత్తగా ఒక్క పరిశ్రమా రాలేదు.

'అపాచీ' ఎక్కడ?

శ్రీకాళహస్తి మండలం ఇనగలూరు వద్ద అపాచీ సంస్థ ద్వారా రూ.700 కోట్లతో భారీ పాదరక్షల తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు జగన్ ప్రభుత్వం హడావిడి చేసింది. 2022 జూన్ 23న సీఎం జగన్ ఇలగనూరుకు వచ్చి శంకుస్థాపన కూడా చేశారు. ఈ పరిశ్రమతో 10 వేల మందికి ఉపాధి లభిస్తుందని, అందులో 80 శాతం మంది మహిళలే ఉంటారని జగన్ ప్రకటించారు. 2023 సెప్టెంబరుకల్లా పనులు పూర్తవుతాయని, ఈ ప్రాంతానికి కొత్త ఉషోదయం ప్రారంభమవుతుందని చెప్పుకొచ్చారు. ఇప్పటికీ పనులే మొదలు కాలేదు. భూమి పూజ జరిగిన చోట శంకుస్థాపన శిలాఫలకం ఆనవాళ్లు కూడా లేకుండా మాయం చేశారు. అక్కడి బీడు భూములు జగన్ శంకుస్థాపన తంతును వెక్కిరిస్తున్నాయి.



ఈ బూట్లే ఇక్కడ తయారయ్యేదంటూ శంకుస్థాపన రోజున సీఎం జగన్‌కు చూపుతున్న యాజమాన్య ప్రతినిధులు



అపాచీ శిలాఫలకం చివరికి ఇలా మిగిలింది

చంద్రబాబు రప్పించిన వాటికే ప్రారంభోత్సవాలు


రేణిగుంట విమానాశ్రయానికి వెనుకవైపున ఉన్న ఎలక్ట్రానిక్స్ మ్యాన్యుఫాక్చరింగ్ క్లస్టర్-1లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు శంకుస్థాపన చేసిన టీసీఎల్ పరిశ్రమను 2022 జూన్ 23న సీఎం జగన్ ప్రారంభించారు. అదే క్లస్టర్‌లోనే సన్నీ ఓపో టెక్ కంపెనీకి సంబంధించిన మొబైల్ ఫోన్లకు సంబంధించిన కెమెరా మాడ్యూల్స్ తయారీ యూనిట్.. ఫాక్స్ లింక్ మాన్యుఫాక్చరింగ్ యూనిట్‌ను ప్రారంభించారు. ఆ క్లస్టర్‌లోనే సెవెన్ హిల్స్ డిజిటల్ పార్క్ విస్తరణకు, క్లస్టర్ 2లోని డిక్సన్ టీవీ తయారీ యూనిట్‌కు శంకుస్థాపనలు చేశారు. ఇవన్నీ కూడా టీడీపీ ప్రభుత్వంలో జిల్లాకు వచ్చేలా ఒప్పందాలు కుదుర్చుకున్నవి.. చంద్రబాబు భూమి పూజ చేసినవే కావడం గమనార్హం.

'రిలయన్స్ జియో' వెనుకంజ

తిరుపతి వద్ద రూ. 15 వేల కోట్లతో రిలయన్స్ జియో ఇండస్ట్రీ ఏర్పాటుకు 2018 ఫిబ్రవరిలో విశాఖలో జరిగిన సీఐఐ భాగస్వామ్య సదస్సులో నాటి సీఎం చంద్రబాబు చొరవ తీసుకుని రిలయన్స్ అధినేత ముఖేష్ అంబానీని ఒప్పించారు. ఈ మేరకు ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఫోన్లు, టీవీలు, సెట్‌టాప్ బాక్సులు, ఎలక్ట్రానిక్ పరికరాలు తయారీ చేసే ఈ పరిశ్రమ ద్వారా 2 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయని అంచనా. రేణిగుంట మండలంలో 150 ఎకరాలను అధికారులు సేకరించారు. పది లక్షల ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తి సామర్థ్యంతో ప్రపంచశ్రేణి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ యూనిట్ ఏర్పాటు కావాల్సిన తరుణంలో ప్రభుత్వం మారింది. రిలయన్స్ జియో కోసం సేకరించిన 150 ఎకరాలకు పరిహారం సంతృప్తికరంగా లేదని 12 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించి స్టే తెచ్చుకున్నారు. రైతులతో చర్చించి ఒప్పించేందుకు, సమస్యను పరిష్కరించేందుకు వైసీపీ ప్రభుత్వం ఎలాంటి చొరవా తీసుకోలేదు. ప్రభుత్వ తీరుతో రిలయన్స్ విసిగిపోయింది. తాము పరిశ్రమ ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకుంటున్నట్టు 2019 నవంబరులో ప్రకటించింది. తద్వారా పేరు ప్రఖ్యాతులు, యువతకు ఉపాధి పొందాల్సిన జిల్లా తీవ్రంగా నష్టపోయింది.

అమరరాజను వేధించి వెళ్లగొట్టారు

రేణిగుంట మండలం కరకంబాడి వద్ద 1985 డిసెంబరులో గల్లా రామచంద్ర నాయుడు, గల్లా అరుణకుమారి దంపతులు స్థాపించిన అమరరాజా బ్యాటరీస్ దేశంలోనే ప్రతిష్టాత్మకమైన సంస్థ. రూ. 11 వేల కోట్లకు పైగా వార్షిక టర్నోవర్‌తో నడుస్తున్న ఈ పరిశ్రమ జిల్లాలో 16 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తోంది. దేశవ్యాప్తంగా ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ లక్ష మంది ఉపాధి పొందుతున్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చీ రావడంతోనే అమరరాజపై వేధింపులు మొదలయ్యాయి. యాదమరి మండలం నూనెగుండ్లపల్లె వద్ద కూడా అమరరాజా సంస్థ బ్యాటరీల తయారీ ప్రారంభించింది. ఈ రెండు చోట్లా నడుస్తున్న తొమ్మిది యూనిట్ల వల్ల కాలుష్యం ఏర్పడుతోందని కారణం చూపుతూ ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు జారీ చేసిన ఆదేశాలతో 2021 మే 1న ఎస్పీడీసీఎల్ విద్యుత్ సరఫరా నిలిపివేసింది. దీంతో సంస్థకు రూ. 50 కోట్ల మేర నష్టం వాటిల్లింది. తర్వాత కూడా వేధింపులు కొనసాగడంతో విసిగివేసారిన అమరరాజా సంస్థ తదుపరి విస్తరణ యూనిట్లను ఇరుగుపొరుగు రాష్ట్రాలలో ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఆ మేరకు 2023 మేలో తెలంగాణలో రూ. 9500 కోట్ల పెట్టుబడితో లిథియం బ్యాటరీల తయారీ యూనిట్ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. ఈ ప్లాంటు జిల్లాలో ఏర్పాటు కాకపోవడం వల్ల రూ. 9500 కోట్ల పెట్టుబడులు, 4500 ఉద్యోగాలను జిల్లా కోల్పోవాల్సి వచ్చింది. కొత్త పరిశ్రమలు జిల్లాకు తీసుకురాకపోగా వున్న వాటిని జిల్లా నుంచీ వెళ్ళగొట్టేలా అధికార పార్టీ నేతలు వ్యవహరిస్తున్నారని జిల్లా ప్రజలు మండిపడ్డా కక్షల రాజకీయాల్లో తేలే నాయకులు తప్పు దిద్దుకోలేదు.



స్వర్ణముఖిపై 'బియ్యపు' గాలిమేడలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: భక్తులు పరమ పవిత్రంగా భావించే స్వర్ణముఖి నది అధ్వాన స్థితికి అద్దం పడుతున్న చిత్రమిది. అగస్త్య మహర్షి తపోశక్తితో ఉత్తర వాహినిగా స్వర్ణ వర్ణ కాంతులతో ఉద్భవించిన నదిని సువర్ణముఖిగా భక్తులు ఆరాధిస్తుంటారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి స్వర్ణముఖి నదిని ప్రస్తావించిన ప్రతిసారి అద్భుతాలు సృష్టిస్తాననడం అలవాటుగా మారిపోయింది. ఎమ్మెల్యేగా గెలిచాక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఇరిగేషన్ అధికారులతో తొలి సమావేశం నిర్వహించి స్వర్ణముఖికి మోక్షం వచ్చిందని ప్రకటన చేశారు. చరిత్రలో నిలిచిపోయేలా ఈ నదిని ప్రక్షాళన చేస్తున్నామన్నారు. నదిపై చెక్ డ్యాములు నిర్మిస్తామని.. ఏడాది పొడవునా జలకళ తీసుకొస్తామని చెప్పుకొచ్చారు. సుందరమైన స్నాన ఘట్టాలు, లైటింగ్, బోటింగ్, లేజర్ షోలు.. ఒక్కటేమిటి ప్రజలను ఊహల పల్లకిలో ఊరేగించారు. స్వర్ణముఖి కరకట్టలను సుందరీకరించి ఆహ్లాదకరమైన వాకింగ్ ట్రాక్‌లు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. తర్వాత ప్రైవేట్ ఎక్స్‌కవేటర్ల యజమానులను పిలిపించి మొక్కుబడిగా ఒకసారి పిచ్చి మొక్కలను తొలగించారు. తర్వాత కొద్ది నెలలకే మళ్లీ పాత వాతావరణం ఏర్పడింది. ముక్కంటి ఆలయం వద్ద పడమర వైపున స్వర్ణముఖి కరకట్టను నిర్మించారు. అది కూడా ఫ్లడ్ వాల్ తక్కువ ఎత్తులో. దానిపైన గ్రావెల్ ఎక్కువ ఎత్తులో అనాలోచితంగా నిర్మించారు. కొద్ది నెలలకే గ్రావెల్ కోతకు గురైంది. నదిలోకి జారడంతో కొత్త కట్ట అధ్వానంగా మారింది. స్వర్ణముఖి గతం కన్నా దయనీయంగా మారిపోయింది. గతంలో మురుగునీరు, వ్యర్థాలు కొంత కలిసేవి. ప్రస్తుతం ఆలయ పరిసరాల్లో ప్రైవేట్ లాడ్జిలు పెరిగిపోవడం, మురుగు నీటి వ్యవస్థ లేకపోవడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. లైటింగ్, బోటింగ్, ప్రపంచ స్థాయి పర్యాటక కేంద్రమంటూ చెప్పిన మధుసూదనరెడ్డి మాటలన్నీ నీటిమూటలేనని ప్రజలు విమర్శిస్తున్నారు.

చెవిలో పువ్వు



ఫ్యాను రెక్కలు ముక్కలు



సూళ్లూరుపేట వర్తమానం

తడ, ఏప్రిల్ 20: సూళ్లూరుపేట వైసీపీని అసమ్మతి పుట్టి ముంచేటట్టే ఉంది. మరోవైపు టీడీపీ జోరు పెంచుకుంటోంది. 2014, 2019 ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేసిన కిలివేటి సంజీవయ్య గెలుపొందారు. రెండోసారి గెలిచాక ఆయన వైఖరిలో వచ్చిన మార్పు పార్టీ శ్రేణులను నెమ్మది నెమ్మదిగా దూరం చేసింది. అనుకూల, ప్రతికూల వర్గాలుగా పార్టీ చీలిపోయింది. పార్టీ కార్యక్రమాల్లోనూ ఇదే ప్రస్ఫుటమవుతోంది. చాలామంది నాయకులు పైకి పార్టీ కోసమే పనిచేస్తున్నామని చెబుతున్నా లోన రగిలిపోతూనే ఉన్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ అధికారంలోకి రాగానే సూళ్లూరుపేట నియోజకవర్గంలో నాయకులు ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు అనుకూల, వ్యతిరేక వర్గాలుగా చీలిపోయారు. ఏడాది క్రితం మాటల దాడితో సరిపెట్టుకున్న ఇరువర్గాలు ఆ తరువాత ప్రత్యక్ష దాడులకు దిగుతున్నారు. ఈ నియోజకవర్గ పరిస్థితిపై అధిష్టానానికి ఫిర్యాదులు వెల్లువెత్తాయి. రెండువర్గాల మధ్య సయోధ్య కోసం పార్టీ పెద్దలు చేసిన కృషి ఫలించలేదు. అదే సమయంలో మరోసారి కిలివేటికి టిక్కెట్ ఇస్తే ఓడిస్తామంటూ బహిరంగంగానే వ్యాఖ్యలు చేసినా అధిష్టానం పట్టించుకోలేదు. కిలివేటి టిక్కెట్ అయితే తెచ్చుకున్నారు గానీ అసమ్మతి నాయకులను మాత్రం దారిలోకి తెచ్చుకోలేకపోయారు. కొందరు పార్టీవీడి టీడీపీలో చేరిపోయారు. పెళ్లకూరు మండలంలో జరుగుతున్న మట్టి తవ్వకాల్లో వాటాలపై ఎస్‌డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డికీ సూళ్లూరుపేట పట్టణ అధ్యక్షుడు కళత్తూరు శేఖర్ రెడ్డికీ మధ్య జరిగిన వివాదం పార్టీ పరువును బజారున పడేసింది. ఇక ఏకంగా ప్రచారంలోనే పార్టీనేతలు బాహాబాహీలకు దిగుతున్నారు. ఈ గొడవలతో చెంగాళమ్మ ఆలయ మాజీ ట్రస్టుబోర్డు చైర్మన్, అసమ్మతి నేత దువ్వూరు బాలచంద్రారెడ్డి అలిగి హైదరాబాదుకు వెళ్లిపోయారు. టీడీపీ మీద అలిగిన వేనాటి రామచంద్రారెడ్డిని వైసీపీలోకి తెచ్చుకున్నామన్న ఆనందం కూడా ఆ పార్టీకి మిగలడం లేదు. ఆయన అనుచరులెవ్వరూ టీడీపీని వీడి రాలేదు.


సైకిల్ జోరు

బలమైన ఓటు బ్యాంకు ఉన్నా గత రెండు ఎన్నికల్లో టీడీపీని గ్రూపు రాజకీయాలు దెబ్బతీశాయి. 2014లో టీడీపీ అభ్యర్థి పరసా వెంకటరత్నం 3,762 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 2019లో కూడా పాత పరిస్థితే విజయాన్ని దూరం చేసింది. గడచిన ఐదేళ్లుగా పార్టీలో నాయకులు కలసి పనిచేయడం ప్రారంభించారు. విభేదాలను పక్కన పెట్టి క్యాడర్‌ను ఒక తాటిమీదకు తెచ్చేలా అధిష్టానం చర్యలు తీసుకొంది. టీడీపీకి పెద్ద దిక్కుగా వ్యవహరించిన వేనాటి రామచంద్రారెడ్డి పార్టీని వీడినా కేడర్ మాత్రం పార్టీకి వెన్నుదన్నుగా నిలబడింది. వైసీపీ నుంచి రఫీ, పుట్టు రమణమూర్తి, తాటిపర్తి శ్రీనివాసులరెడ్డి, నలుబోయిన రాజసులోచనమ్మ వంటి నాయకులు టీడీపీలో చేరారు. మాజీ ఎమ్మెల్యే నెలవల సుబ్రమణ్యం కుమార్తె విజయశ్రీని అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీలో అన్ని వర్గాలూ కలసి పనిచేస్తున్నాయి. పరసారత్నం వంటి నాయకులు కూడా ఆమె అభ్యర్థిత్వానికి జై కొట్టారు. బీజేపీ, జనసేన జత కట్టడం టీడీపీకి కలిసొచ్చే అంశం. గత ఎన్నికల్లో జనసేనకు ఇక్కడ 5,513, బీజేపీకి 1729 ఓట్లు పోలయ్యాయి. ప్రచారంలో కూటమి పక్ష శ్రేణులు చురుగ్గా పాల్గొనడంతో టీడీపీలో చాన్నాళ్ల తర్వాత సమరోత్సాహం వెల్లివిరుస్తోంది.

కాంగ్రెస్ ఓట్లతో వైసీపీకి ముప్పు

కాంగ్రెస్ తరఫున నాయుడుపేటకు చెందిన గాడి తిలక్‌బాబు బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 2698 ఓట్లు వచ్చాయి. ఈసారి ఓట్లు పెరుగుతాయని ఆపార్టీ వర్గాలు ధీమాగా చెబుతున్నాయి. వీరి ఓట్లశాతం పెరిగితే వైసీపీకి నష్టమని రాజకీయ పరిశీలకుల అంచనా.

రాష్ట్ర భవిష్యత్తు కోసం చంద్రబాబును మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందాం: ఆదిమూలం




చంద్రబాబుకు వెంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరిస్తున్న ఆదిమూలం - సభలో టీడీపీ, జనసేన, ఎమ్మార్పీఎస్ జెండాల రెపరెపలు

సత్యవేడు, ఏప్రిల్ 20: రాష్ట్ర భవిష్యత్తు కోసం టీడీపీని గెలిపించుకుని చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేసుకుందామని సత్యవేడు టీడీపీ అభ్యర్థి, ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. సత్యవేడులో ప్రజాగళం సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఎన్డీఏ ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను తనను గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి, నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. నా ఎస్సీలు, నా బీసీలు, నా మైనారిటీలు అని చెప్పుకునే జగన్ పార్టీలో అదంతా ఒట్టి బూటకమే అన్నారు. సత్యవేడు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి సహజ వనరులను దోచుకుంటున్నారని సీఎం జగన్‌కు చెబితే చర్యలు తీసుకోకపోగా, దళితుడైన తనకు పార్టీ నుంచి గెంటేశారని తెలిపారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం: వరప్రసాద్

రాష్ట్రంలో వైసీపీ మళ్లీ గెలిస్తే ప్రజాస్వామ్యం ఉండదని, ఎన్డీఏ కూటమి అభ్యర్థులను గెలిపించుకుని రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందామని తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్ కోరారు. ఒక ఐఏఎస్ అధికారిగ తాను ఎంతో మంది ముఖ్యమంత్రుల వద్ద పనిచేశానని, జగన్ లాంటి ముఖ్యమంత్రిని తానెప్పుడూ చూడలేదన్నారు. దళితులపై దౌర్జన్యాలు అధికమయ్యాయని, వైసీపీ ప్రభుత్వం దళితద్రోహిగా మిగిలిందని విమర్శించారు. టీడీపీ మహిళా నాయకురాలు చక్రాల ఉష మాట్లాడుతూ మద్యపాన నిషేదం చేశాకే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానని చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్, నేడు రాష్ట్రంలో మద్యపాన నిషేధం చేయకపోగ, కల్తీమద్యంతో ఆడపడచుల తాళిబొట్లు తెగిపోతున్నాయని ఆదేవన వ్యక్తం చేశారు. జనసేన నియోజకవర్గ అధక్షుడు లావణ్య కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షసపాలన కొనసాగుతోందన్నారు. కాగా, చంద్రబాబు పర్యటనతో సత్యవేడు హుషారెత్తింది. స్థానిక అజయ్ కల్యాణ మండపం సమీపంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 6.30గంటలకు చేరుకున్న చంద్రబాబు అక్కడ మాజీ ఎమ్మెల్యే హేమలతతో అరగంట పాటు చర్చలు జరిపారు. అనంతరం దళవాయి అగ్రహారంలోని గంగమ్మ దేవతకు పూజలు జరిపారు. అక్కడ నుంచి బయలుదేరి సభాస్థలానికి 7.11 నిమిషాలకు చేరుకున్నారు. రాత్రి 7.13కు మొదలైన చంద్రబాబు ప్రసంగం 8.22 గంటలకు వరకు కొనసాగింది. క్లాక్ టవర్ మూడువైపులా కిక్కిరిసిన జన సందోహాన్ని చూసిన చంద్రబాబు ఉద్వేగంతో వారిని పలకరించారు. నేను సత్యవేడుకు ఎప్పుడు వచ్చినా నాపై మీరు చూపించే ఆదరణ, ఆప్యాయతకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ప్రసంగం మొదలు పెట్టారు. ఆద్యంతం సమస్యలపై ప్రశ్నలు, వైసీపీ ప్రభుత్వంపై వ్యంగ్యాస్త్రాలతో హుషారెత్తించారు. సభలో హీరో, అపోలో పరిశ్రమల యూనిఫాంతో వచ్చిన ఉద్యోగులను చూసిన చంద్రబాబు వారిని ఏం తమ్ముళ్ళు బాగున్నారా అంటూ పలకరించారు. ఆ పరిశ్రమలు తెచ్చింది నేనేంటూ వారికి తెలిపారు.

సైకిలెక్కిన ఏలుమలై మొదలియార్

- బాబు సమక్షంలో టీడీపీలో చేరిక
- నగరి వైసీపీలో భారీ కుదుపు

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 20: నగరి టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్ ఇచ్చిన మాస్టర్ స్ట్రోక్‌కు నగరి నియోజకవర్గ వైసీపీకి మైండ్ బ్లాక్ అయ్యింది. ఆ పార్టీలో అత్యంత కీలకమైన నేత, వైసీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీపీ, మంత్రి రోజాపై అసమ్మతి నాయకుడు డీఎన్ ఏలుమలై మొదలియార్ (అమ్ములు) సైకిలెక్కారు. శనివారం సత్యవేడులో చంద్రబాబు చేతుల మీదుగా టీడీపీ కండువా కప్పుకున్నారు. ఆయనతో డీసీసీబీ మాజీ డైరెక్టర్ ఎస్. లక్ష్మీపతి యాదవ్, ప్రముఖ బిల్డర్ వెంకటముని కూడా టీడీపీలో చేరారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఏలుమలై, పక్కన భానుప్రకాష్, లక్ష్మీపతి యాదవ్, వెంకటముని

భానుప్రకాష్ మంత్రాంగం...

2019 ఎన్నికల తరువాత వైసీపీలో బలమైన నాయకులను మంత్రి రోజా దూరం పెట్టి ఆమె కుటుంబసభ్యులకు సేఫ్ పాసేజ్ ఇచ్చారు. దీంతో ఆయా మండలాల్లో నాయకులు ఎదురుతిరిగారు. వీరి మధ్య సయోధ్య కోసం పలుమార్లు చర్చలు జరిగినా ఫలితం లేకుండాపోయింది. ఈ నేపథ్యంలో రోజాకు మరోసారి టికెట్ ఇవ్వద్దని అసమ్మతి నాయకులు తిరుగుబాటు చేశారు. వీరి అభ్యర్థనలను వైసీపీ అధిష్టానం బేఖాతర్ చేస్తూ మళ్లీ ఆమెకే టికెట్ ఖరారు చేసింది. సరిగ్గా ఈ అవకాశాన్ని నగరి ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్ సద్వినియోగం చేసుకున్నారు. అసమ్మతి నాయకులతో పలుమార్లు చర్చలు జరిపి తన వైపునకు తిప్పుకోవడంలో సఫలీకృతులయ్యారు.

రోజాకు క్లిష్ట పరిస్థితులు

కీలక నేతలు చేజారిపోవడంతో రానున్న ఎన్నికల్లో మంత్రి రోజాకు క్లిష్ట పరిస్థితులు ఎదురవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. నియోజకవర్గంలో మొదలియార్ సామాజికవర్గ ఓటర్లు ప్రభావిత స్థాయిలో ఉన్నారు. ఈ సామాజికవర్గం నుంచి బలమైన నాయకుడు ఏలుమలై మొదలియార్ టీడీపీ తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీకి కలిసిరానుంది. మాజీ మంత్రి చెంగారెడ్డి అనుచరుడిగా రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన ఏలుమలై పుత్తూరు ఎంపీపీ, సర్పంచు, రెండుసార్లు మున్సిపల్ ఫ్లోర్ లీడర్‌గా వ్యవహరించారు. 2014 ఎన్నికల ముందు పెద్దిరెడ్డితో ఉన్న అనుబంధంతో వైసీపీ కండువా కప్పుకున్నారు. రెండు ఎన్నికల్లోను రోజా గెలుపులో క్రియాశీలక పాత్ర పోషించారు. పుత్తూరు, నగరి పట్టణంలో బలంగా ఉన్న మొదలియార్ సామాజికవర్గాన్ని ప్రభావితం చేయగలిగిన ఏలుమలై చేరికతో టీడీపీలో నూతనోత్సాహం తొణికిసలాడుతోంది.

రేణిగుంటలో రాత్రి వేళ రిజిస్ట్రేషన్లు!




రాత్రివేళ తెరిచి ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం - బయట సిబ్బంది కారు

రేణిగుంట, ఏప్రిల్ 20: రేణిగుంట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం రాత్రి వేళ పనిచేస్తుండడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం రాత్రి 11 గంటలు కావస్తున్నా... సిబ్బంది లోపల పనులు చేస్తూ కనిపించారు. ఈ విషయమై కార్యాలయ సిబ్బందిని వివరణ కోరగా సోమవారం కోర్టుకు హాజరుకావలసి ఉందని, ఆదివారం సెలవు కావడంతో ఆ పనులు చేసుకుంటున్నామని తెలిపారు. అయితే చంద్రగిరి ఎమ్మెల్యే సోదరుడికి సంబంధించిన ఓ రిజిస్ట్రేషన్ జరుగుతోందని సమాచారం. సాయంత్రం 5 గంటల లోపల రిజిస్ట్రేషన్ ముగించి కార్యాలయం మూసివేసి వెళ్లాలి. సర్వర్లు డౌన్ కావడంతో రాత్రి 8.30 గంటల వరకు పనిచేసినట్లు సమాచారం. కాగా, రిజిస్ట్రేషన్ అయిన నెంబర్ కోసం కార్యాలయంలోని అధికారులు, సిబ్బంది వేచి ఉన్నట్లు సమాచారం.

హేమలత నామినేషన్ దాఖలు

సత్యవేడు, ఏప్రిల్ 20: మాజీ ఎమ్మెల్యే హేమలత సత్యవేడులో శనివారం నామినేషన్ దాఖలు చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 1999 నుంచి టీడీపీలోనే కొన సాగుతున్నానన్నారు. ఎంపీపీగా, ఎమ్మెల్యేగా నియోజకవర్గ ప్రజలకు సేవచేశానన్నారు.

చంద్రబాబుకు గొర్రెపిల్ల బహుకరణ



సత్యవేడు, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబుకు తిరుపతి పార్లమెంట్ తెలుగు యువత అద్యక్షుడు రాంప్రకాష్ యాదవ్, నాగలాపురం మండల అద్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవ సంఘం నేతలు గొర్రెపిల్లను బహుకరించారు. కార్యక్రమంలో రాజశేఖర్ యాదవ్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం

వడమాలపేట, ఏప్రిల్ 20: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజల ఎవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయ నాంచారులతో ప్రసన్న వెంకటేశ్వరస్వామి వారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేద మంత్రాలు, భక్తులు గోవింద నామ స్మరణల నడుమ శ్రీవారి ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి : టీడీపీ

వడమాలపేట, ఏప్రిల్ 20: అవినీతి, అరాచక వైసీపీ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని చిత్తూరు జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు అబ్బరాజు కోరారు. శనివారం మండలంలోని బట్టీకండ్రిగ పంచాయతీ పరిధిలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. గాలి భానుప్రకాష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ధనంజయులు నాయుడు, వెంకటయ్య, సుబ్రహ్మణ్యంరెడ్డి, హేమావతి, లక్ష్మీప్రసన్న, ఉదయ్ యాదవ్, రామ్మూర్తి నాయుడు, రవి నాయుడు, పొన్నాయ్ రాజు, సుబ్రహ్మణ్యం, రఘు, వెంకటరమణ, వెంకటేష్, మోహన్, గిరిబాబు, నారాయణరాజు, శివశంకర్, నితీష్, శివరాయల్, కుమార్, దేవ, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా అగస్త్యేశ్వరస్వామి రథోత్సవం

నారాయణవనం, ఏప్రిల్ 20: మండలంలోని సముదాయం గ్రామంలో ఉన్న మరగదవల్లీ సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి స్వామివారిని రథంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారికి నిత్యపూజా కైంకర్యాలు చేపట్టారు. అనంతరం ఉత్సవ మూర్తులను తిరుచ్చి వాహనంపై ఆలయ అంతర్రప్రాకరంలో ఊరేగించారు. సాయంత్రం విశేష పూజలనంతరం, మేళతాళలు, మంగళవాయిద్యాలు, భక్తుల కోలాటల నడుమ స్వామివారిని రథంపై గ్రామవీధుల్లో ఊరేగించారు.

వైభవంగా కల్యాణ వెంకన్న ఊంజలసేవ

నారాయణవనం, ఏప్రిల్ 20: నారాయణవనంలోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజలసేవను వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, నిత్యకైంకర్యాలు చేపట్టారు. అనంతరం స్వామివారిని, శ్రీదేవి, భూదేవి ఉత్సవర్లను ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధర్ బట్టాచార్య, శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకన్న ఊంజల సేవ నిర్వహించారు. భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు.



చిత్తూరు పార్టీ కార్యాలయంలో

నారా భువనేశ్వరితో కుప్పంలో ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల



- మామిడి రైతుల కోసం మ్యాంగో బోర్డు ఏర్పాటు
- చిత్తూరు దాహార్తిని తీర్చేందుకు అడవిపల్లె ప్రాజెక్టు పనులు పూర్తి

చిత్తూరుకు యూనివర్సిటీ.. నాది గ్యారంటీ

ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేసిన చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



గత ఎంపీల తరహాలో ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా నేరుగా తనకంటూ ప్రత్యేక ప్రణాళికను రచించుకుని ముందుకుపోతున్నారు చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు. టీడీపీ అధిష్ఠానం ఆయన్ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి తన మార్క్ ప్రచారంతో దూసుకుపోతున్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకుని వెళుతున్నారు. ఈయనతో సమానంగా ఆయన కుమారుడు, రాధే కన్‌స్ట్రక్షన్ అధినేత రాధే కూడా ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. దగ్గుమళ్ల కుటుంబం కూడా ఆయన గెలుపు కోసం రాత్రింబవళ్లు కృషి చేస్తోంది. ఈ నెల 18న దగ్గుమళ్ల కుటుంబ సభ్యులతో ఎలాంటి ఆడంబరాలూ లేకుండా సాదాసీదాగా ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆదర్శంగా నిలిచారు.

- చిత్తూరు

ఈ క్రమంలోనే తాను పోటీ చేస్తున్న చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించారు. శనివారం చిత్తూరు టీడీపీ జిల్లా కార్యాలయం సహా పలుచోట్ల చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, రాధే, కాజూరి బాలాజీ, కాజూరి రాజేష్, టీడీపీ నేత, విశ్రాంత ఎస్పీ చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు దొరబాబు, సీఆర్ రాజన్, గురజాల జగన్మోహన్, చంద్రప్రకాష్, కఠారి హేమలత, సురేంద్రకుమార్, కోదండయాదవ్, సుబ్రి, త్యాగరాజన్, వైపీ రాజేశ్వరిలతో కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు.



చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు




మేనిఫెస్టో లోగోలు

- జిల్లా కేంద్రమైన చిత్తూరులో చెప్పుకోదగ్గ విద్యా సంస్థలులేవు. దీంతో దగ్గుమళ్ల విద్యా ప్రమాణాలను పెంచేందుకు యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.
- జిల్లాలో మామిడిసాగు ఎక్కువగా ఉంది. మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకునేందుకు మ్యాంగో బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- ప్రస్తుతం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదు. తాను ఎంపీగా గెలిస్తే ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరులో ఆగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.
- కాట్పాడి నుంచి తిరుపతి వరకు డబుల్ రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- చిత్తూరు చుట్టూ జరిగే రోడ్డు ప్రమాదాల బాధితుల కోసం కనీసం ట్రామా కేర్ సెంటర్ కూడా లేదు. తాను గెలిస్తే చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కచ్చితంగా ట్రామాకేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తానన్నారు.
- జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- చిత్తూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దే బాధ్యత తనదే అన్నారు.
- సీఎంసీ ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.
- అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు నీళ్లను తీసుకొచ్చి నగర ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు.
- చిత్తూరులో ఆటోమొబైల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు.
- నగరిలో చేనేత కార్మికుల కోసం ప్రత్యేకంగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేసి అక్కడి భూ గర్భ జలాలు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు.
- జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో ఏనుగుల బెడద కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్య నివారణకు బంగారుపాళ్యం నుంచి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కందకాలు నిర్మిస్తామన్నారు.

దగ్గుమళ్ల మేనిఫెస్టో ఇలా...

- పలమనేరులోని సిల్క్ ఫామ్ ఆధునికీకరణకు చర్యలు చేపడతామన్నారు.
- జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వేదపాఠశాల ఏర్పాటుతో పాటు అధునాతన సదుపాయాలతో ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్ ను ఏర్పాటు చేస్తానని సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చి మరిచారు. ఎంపీగా గెలిస్తే ఆ నియోజకవర్గంలో కచ్చితంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గలో లెదర్‌పార్కును ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానన్నారు.
- పలమనేరు, కుప్పం ప్రాంతాలకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
- చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినప్పటికీ దాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎంపీగా గెలిస్తే ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రత్యేక పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక భరోసా ఇస్తామన్నారు.
- గత టీడీపీ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించి వ్యవసాయాన్ని పండుగలా చేసింది. వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తెచ్చేలా డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.
- మహిళలకు ఉపాధి కల్పించేందుకు అంతర్జాతీయ సంస్థల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు.
- నిరుద్యోగ యువతకు పలు రంగాల్లో నైపుణ్యతను పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీతో పాటు స్టడీ సర్కిల్స్‌ను తెస్తామన్నారు.
- తరచూ జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
- జిల్లాలో చెరువులను మరమ్మతులు చేసి భూగర్భ జలాలు పెంచేందుకు కొత్తగా చెక్‌డ్యాములను నిర్మిస్తామన్నారు.
- అడవులను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.
- క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు చిత్తూరులో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.
- ఈడిగ, గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రచిస్తామన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

వైసీపీ నామినేషన్ ర్యాలీలో గందరగోళం



ర్యాలీ ఆరంభంలోనే వెళ్లిపోతున్న జనం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థి నామినేషన్ పర్వం అత్యంతం గందరగోళంగా జరిగింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి నామినేషన్ మూడు రోజుల క్రితం అట్టహాసంగా జరిగిన విషయం తెలిసిందే. అంతకుమించి జనబలం ప్రదర్శించాలన్న వైసీపీ ప్లాన్ అట్టర్ ఫ్లాప్ అయింది. డబ్బులిచ్చి జనాన్ని తరలించినప్పటికీ అందరినీ ర్యాలీలో నడిపించలేకపోయారు. ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభం కావాల్సిన ర్యాలీ మూడు గంటలు ఆలస్యంగా 11 గంటలకు మొదలైంది. వైసీపీలో అభ్యర్థి మధుసూదనరెడ్డి చిన్న ప్రచార వాహనంపై, వెనుక ఎంపీ అభ్యర్థి గురుమూర్తి, ఆ తర్వాత ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మరో ప్రచార వాహనంపై సాగారు. ఎండ విపరీతంగా పెరిగిపోవడంతో శ్రీరామ్ నగర్ కాలనీ ఆరంభంలోనే అమరజ్యోతి కళ్యాణమండపం కూడలి వద్ద జనం ర్యాలీ నుంచి వెళ్లిపోవడం మొదలైంది. రామసేతు వంతెన వద్దకు ర్యాలీ చేరుకోగానే పక్కనే ఉన్న సన్నిధి వీధి రోడ్డులోకి జనం భారీగా వెళ్లిపోయారు. అసలే అరకొర జనం ఆపై ఉన్నవారు కూడా వెళ్లిపోతే అవమానం తప్పదని వైసీపీ నాయకులు అప్రమత్తమయ్యారు. రామసేతు వంతెన వద్ద మానవహారంగా ఏర్పడి జనం వెళ్లిపోకుండా అడ్డుగా నిలబడ్డారు. ర్యాలీకి వచ్చిన వారితో పాటు సొంత పనుల నిమిత్తం వెళ్లే ద్విచక్ర వాహనదారులు సైతం ఇదేం తీరు అంటూ నిలదీశారు. ఆ తర్వాత ముక్కంటి ఆలయం శివయ్య గోపురం వరకు ర్యాలీ సాగింది. అక్కడ అకస్మాత్తుగా ఎమ్మెల్యే ప్రచార వాహన దిగి ద్విచక్ర వాహనంపై నామినేషన్ కేంద్రానికి వెళ్లిపోయారు. ఆయనను అనుసరిస్తూ మిగతా నేతలు కూడా ద్విచక్ర వాహనాలపై పయనమయ్యారు. అక్కడి నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నాయకులు లేకుండానే ఉత్తుత్తి ర్యాలీ సాగింది.

నాలుగు నామినేషన్ల సమర్పణ

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిత్వానికి శనివారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మొదట నాయుడుపేటకు చెందిన తీగల భాస్కర్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆ తర్వాత వైసీపీ అభ్యర్థులుగా బియ్యపు మధుసూదన్ రెడ్డి, ఆయన సతీమణి శ్రీవాణి రెడ్డి నామినేషన్లు సమర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోతుగుంట రాజేష్ నాయుడు నామినేషన్ అందజేశారు. మొత్తంగా నాలుగు నామినేషన్లు స్వీకరించినట్లు రిటర్నింగ్ అధికారి, ఆర్డీవో రవి శంకర్ రెడ్డి వెల్లడించారు.

రైల్వేట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం

తొట్టంబేడు, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తి మండలంలోని చెర్లోపల్లి ఆర్డీవో ఆఫీస్ వెనుక పక్కనున్న రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి శనివారం ఆత్మహత్య చేసుకున్నట్లు రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలిపారు. మృతుడుకి 40 సంవత్సరాలు ఉండవచ్చునని, మోహంపై గాయాలున్నట్లు గుర్తించారు. తెలుపురంగు టీషర్టు, నీలంరంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రవి తెలిపారు.

శనీశ్వర స్వామికి విశేష పూజలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తీశ్వరాలయంలోని శనీశ్వరస్వామికి విశేష పూజలు జరిగాయి. శనివారాన్ని పురస్కరించుకుని ముందుగా అర్చకులు శనీశ్వరస్వామి సన్నిధిని శుద్ధి చేశారు. భక్తుల నుంచి సంకల్పం స్వీకరించారు. వివిధ పూజా ద్రవ్యాలతో పాటు శని ప్రీతి కోసం విశేషంగా తైలాభిషేకం చేశారు. అనంతరం స్వామివారికి ధూప, దీప, నైవేద్యాలు సమర్పించి విశేషాలంకారంతో దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

అందరినీ కలుపుకుని ముందుకు: సుధీర్‌రెడ్డి



టీడీపీలో చేరిన వారితో బొజ్జల సుధీర్‌రెడ్డి

రేణిగుంట, ఏప్రిల్ 20: టీడీపీలో చేరుతున్న అందరినీ కలుపుకుని ముందుకు పోతామని శ్రీకాళహస్తి ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం రేణిగుంట మండల పరిధిలోని మామండూరులో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మామండూరుకు చెందిన వైసీపీ నాయకుడు కాలేషా నేతృత్వంలో 50 మైనార్టీ కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వారందరికీ సుధీర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి పెద్దసంఖ్యలో నాయకులు టీడీపీలో చేరున్నారని తెలిపారు. వీరందరిని కలుపుకుపోవాల్సిన బాధ్యత సీనియర్ నాయకులపై ఉందన్నారు. జేబీ శ్రీనివాస్ మాట్లాడుతూ బొజ్జల సుధీర్‌రెడ్డిని గెలిపించేందుకు అన్ని విధాలుగా తాము కృషి చేస్తామని చెప్పారు. అనంతరం టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్ కట్‌చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. తరువాత చైతన్యపురం, సీఆర్‌నగర్, గుండ్రాళ్ల కాలువ, శ్రీనివాసపురంలో జనసేన, బీజేపీ, టీడీపీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రారెడ్డి, తేజవతి, సుబ్రహ్మణ్యంరెడ్డి, మునస్వామినాయుడు, కుమార్, మనోహరాచారి, బుజ్జినాయుడు, పాడి రాజంద్ర, మహబూబ్‌బాషా, రాజేష్‌రెడ్డి, కన్నన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, నాదమునిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు దార్శనికత మహోన్నతం : రిషితా రెడ్డి

శ్రీకాళహస్తి: చంద్రబాబు నాయుడు దార్శనికత ఎంతో మహోన్నతమైనదని ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి సతీమణి రిషితా రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ భవన్లో శనివారం చంద్రబాబు జన్మదిన వేడుకలు నిర్వహించారు. రిషితా రెడ్డి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... అభివృద్ధి ప్రదాతగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు స్వర్ణాంధ్రగా తీర్చిదిద్దారని గుర్తుచేశారు. నవ్యాంధ్రలో అమరావతి రూపకల్పనతో ఆయన దర్శనీకతను చాటుకున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి ఆయనను ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న రిషిత రెడ్డి

ఉపాధి కూలీలకు రూ.300 వేతనం పెంపు : డ్వామా పీడీ

ఏర్పేడు, ఏప్రిల్ 20: ఉపాధి కూలీలకు రోజువారీ వేతనం రూ.300 పెంచడం జరిగిందని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ తెలిపారు. ఏర్పేడు మండలం కందాడు పంచాయతీలో జరుగుతున్న పెర్క్యులేషన్ పాండ్ పూడికతీత పనులను ఆయన శనివారం తనిఖీ చేసి కూలీలతో మాట్లాడారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందు వల్ల ఉదయం 5.30నుంచి 10గంటల వరకు పనులు చేయాలన్నారు. పని ప్రాంతంలో తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స కిట్ అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో దేవరి, చంద్రశేఖర్ రాజు, బాలాజీరావు, పట్టాభిరెడ్డి, మునెయ్య తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ డ్రామా కంపెనీ
తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు



వరప్రసాద్‌ను సభకు పరిచయం చేస్తున్న చంద్రబాబు

గూడూరు అర్బన్/సర్వేపల్లి/సత్యవేడు, ఏప్రిల్ 20: మానవత్వంలేని జగన్ సారథ్యంలోని వైసీపీ ఓ డ్రామా కంపెనీగా తయారైందని ఉమ్మడి పార్టీల తిరుపతి ఎంపీ అభ్యర్థి వరప్రసాద్‌రావు అభివర్ణించారు. శనివారం చంద్రబాబు సారథ్యంలో నిర్వహించిన ప్రజాగళం సభలో ముందుగా ప్రసంగించిన వరప్రసాద రావు జగన్‌పై విరుచుకుపడ్డారు. చేదు తరువాత తీపి తెలుస్తుందని 12 ఏళ్ల వైసీపీలో తన ప్రయాణంలో చేదేదో తీపేదో తెలిసిందన్నారు. మానవత్వంలేని నాయకుడిగా జగన్‌ను విమర్శిస్తూ తాను దళితుడన్న కారణంతోనే చిన్నచూపు చూసి ఈ ఐదేళ్లల్లో ఎమ్మెల్యేగా వున్న తనను గూడూరులో ముప్పతిప్పలు పెట్టారని విమర్శించారు. జగన్ మాటలకు చేతలకు ఎంతో తేడా ఉందని ఆయనలో నిలువెత్తు అవినీతి, అహంకారం నిండిపోయాయని చంద్రబాబు ఒక్కడే ఆయనకు గుణపాఠం చెప్ప గలరని ఘాటుగా విమర్శించారు. చిల్లకూరు సిలికాను, స్వర్ణముఖిలో ఇసుకను దోచుకుని తాడేపల్లి ప్యాలెస్‌లో దాచుకున్నారన్నారు. చెల్లికి న్యాయం చేయలేని, తల్లికి గౌరవం ఇవ్వలేని నాయకుడు ప్రజలకు ఏమి చేస్తాడని సూటిగా ప్రశ్నించారు.



చంద్రబాబు జన్మదిన వేడుకల్లో వరప్రసాద్ తదితరులు

విద్యుత్ కోతలపై నిరసన



రోడ్డుకు అడ్డంగా ముళ్లకంచె వేసి ధర్నా చేస్తున్న చిలకావారికండ్రిగ గ్రామస్తులు

తొట్టంబేడు, ఏప్రిల్ 20: మండలంలోని చిలకావారికండ్రిగ గ్రామస్తులు విద్యుత్ కోతలను నిరసిస్తూ శనివారం రోడ్డెక్కారు. గత కొద్ది రోజులుగా చిలకావారికండ్రిగ గ్రామానికి సాయంత్రం పూట విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. దీంతో శనివారం తొట్టంబేడు విద్యుత్ కార్యాలయం వద్ద శ్రీకాళహస్తి - చెన్నై ప్రధాన రహదారిపై ముళ్లకంచె వేసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ ప్రతిరోజూ సాయంత్రం ఆరు గంటల నుంచి విద్యుత్ సరఫరా తీసేస్తున్నారని తెలిపారు. వేసవి కావడంతో పిల్లలు, వృద్ధులు అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోకపోవడంతో విసిగిపోయి రోడెక్కాల్సి వచ్చిందని చెప్పారు. దీనిపై విద్యుత్‌శాఖ అధికారులను వివరణ కోరగా కొన్ని నెలలుగా గ్రామంలో లోవోల్టేజ్ సమస్య ఉందన్నారు. సమస్య పరిష్కరించడానికి పనులు ప్రారంభించామని, ఇంతలో ఎలక్షన్ కోడ్ రావడంతో మెటీరియల్ సరఫరా ఆలస్యమవుతోందన్నారు. మెటీరియర్ రాగానే పనులు పూర్తి చేసి సమస్య పరిష్కరిస్తామని అధికారులు చెప్పారు.

ముక్కంటి ఆలయంలో తనిఖీలు



అన్నదానంలో భక్తులతో మాట్లాడుతున్న ఈవో

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తీశ్వరాలయ ఈవో నాగేశ్వరరావు శనివారం పలు విభాగాలను తనిఖీ చేశారు. అన్నదానంలో అన్నప్రసాదాల నాణ్యతపై భక్తులతో మాట్లాడి తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం రాహుకేతు పూజ మండపాలను తనిఖీ చేశారు. తరువాత ఇంజనీరింగ్ శాఖ అధికారులతో కలిసి భరద్వాజతీర్థంలోని గోశాలను తనిఖీ చేశారు. గోవుల సంరక్షణపై ఆరా తీశారు. అలాగే కైలాస సదన్, గంగా సదన్ అతిథి గృహాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్, ఈఈ నూక రత్నమ్మ, డీఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం ఎంపీడీవోగా మహబూబ్‌బీ



వరదయ్యపాళెం, ఏప్రిల్ 20: వరదయ్యపాళెం ఎంపీడీవోగా మహబూబ్‌బీ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కడప జిల్లా చాపాడు మండలం నుంచి బదిలీపై వచ్చారు.

రేపు ముక్తీశ్వరస్వామి ఆలయ ప్రారంభం

వరదయ్యపాళెం, ఏప్రిల్ 20: మండలంలోని కాంబాకం పంచాయతీ కృష్ణాపురంలో ఏకం సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన ముక్తీశ్వరస్వామి ఆలయాన్ని సోమవారం ప్రారంభించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉదయం 6గంటలకు లింగప్రతిష్ఠాపన జరుగుతుందన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

రేణిగుంటలో టీడీపీ ప్రచారం

రేణిగుంట, ఏప్రిల్ 20: రేణిగుంట పట్టణంలో టీడీపీ ప్రచారం జోరుగా సాగుతోంది. శనివారం సాయంత్రం టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణాధ్యక్షుడు మెహబూబ్‌బాషా, నాయకులు పుష్పనాథన్, మునీర్, ఎంజీ రాజేష్‌రెడ్డి, శివయ్య, రవి, రమణ, సంపత్, నాగేశ్వరరావు, కిరణ్, సుబ్రహ్మణ్యం, సుధమ్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

నవమి ఉత్సవాలకు వచ్చి వెళ్తూ..
రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెళ్లకూరు, ఏప్రిల్ 20: శ్రీరామ నవమి ఉత్సవాలకు స్వగ్రామానికి వచ్చి వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ ప్రాణాలు కోల్పోయింది, ఆమె భర్త గాయపడ్డాడు. నాయుడుపేట మండలం జువ్వలపాలేనికి చెందిన సుందరరామయ్య ఆమె భార్య మునికుమారి (49) శ్రీకాళహస్తిలో నివాసం ఉంటున్నారు. సుందరమరాయ్య శ్రీకాళహస్తి ఆలయంలో కాంట్రాక్టర్ ఉద్యోగి, ఆయన భార్య ఆర్టీసీ కండక్టర్. భార్యాభర్తలు ఇటీవల స్వగ్రామంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం శనివారం ఉదయం బైక్‌లో శ్రీకాళహస్తికి తిరిగి పయనమయ్యారు. ఈ క్రమంలో మండలంలోని చెంబేడు క్రాస్ రోడ్డుపై వారిని వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌నుంచి కింద పడిని మునికుమారి తలపై లారీ దూసుకెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. సుందరరామయ్య గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ శ్రీకాంత్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని, క్షతగాత్రుడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తలరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ నేత



చంద్రబాబుతో శివా యాదవ్

తొట్టంబేడు, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తి మండలం కుంటిపూడి మాజీ సర్పంచు, తిరుపతి పార్లమెంటు వైసీపీ యాదవ సంఘం వైస్ ప్రెసిడెంట్ కూనాటి శివా యాదవ్ శనివారం గూడూరులో చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరారు. ఆయనకు చంద్రబాబు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

కాంగ్రెస్‌తో అభివృద్ధి

తొట్టంబేడు, ఏప్రిల్ 20: కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి సాధ్యమని తిరుపతి ఎంపీ అభ్యర్థి చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తి మండలం ముచ్చువోలు, అక్కుర్తి ముద్దుమూడి, వేలవేడు, ఏర్పేడు మంలంలోని చింతలపాళెం, పొంగూరు, రాజులపాళెం, మేర్లపాకు, అంజిమేడు, సీతారాంపేట గ్రామాల్లో శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్‌ను గెలిపించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తేజోవతి, సురేంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం ప్రత్యేక పూజలు



ముక్కంటి ఆలయంలో టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జన్మదినాన్ని పరిష్కరించుకొని టీడీపీ నాయకులు ముక్కంటి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గురవారెడ్డి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం దీపారాధన సమయంలో చంద్రబాబు పేరు మీద అర్చన జరిపించారు. కార్యక్రమంలో రవి, బాలాజీ, దొరైరాజ్, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

12మంది వలంటీర్ల రాజీనామా

ఏర్పేడు, ఏప్రిల్ 2: ఏర్పేడు మండలంలో వికృతమాల పంచాయతీకి చెందిన 12మంది వలంటీర్లు రాజీనామా చేశారు. సచివాలయ సెక్రటరీ సుధాకర్‌కు తమ రాజీనామా పత్రాలను అందించారు. రాజీనామా చేసిన వారిలో పార్వతి, పద్మ, పూజ, మల్లికార్జున్, ఝాన్సీ, సెల్వి, సుగుణ, కవిత, యుగందర్, చంద్ర, కీర్తి, దేవిక ఉన్నారు.

చెక్ పోస్టుల్లో తనిఖీలు



వాంపల్లి చెక్‌పోస్టు సిబ్బందితో విజ్జి శేషాద్రి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 20: శ్రీకాళహస్తి నియోజకవర్గం పరిధిలోని వాంపల్లె, నెలబల్లి చెక్ పోస్టులను ఎన్నికల వ్యయ పరిశీలకురాలు విజ్జి శేషాద్రి తనిఖీ చేశారు. శనివారం ఆమె శ్రీకాళహస్తి నియోజకవర్గంలో పర్యటించారు. రిటర్నింగ్ అధికారికి తనిఖీలపై సూచనలు ఇచ్చారు.

టీడీపీలో చేరిన మాజీ వైస్ సర్పంచ్

పిచ్చాటూరు, ఏప్రిల్ 20: మండలంలోని కొత్తగొల్లకండ్రిగకు చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఉప సర్పంచు గోవింద మండడి శనివారం టీడీపీలో చేరారు. ఆయనకు ఏఎంసీ మాజీ చైర్మన్, ప్రస్తుత క్లస్టర్ ఇన్‌చార్జి ఇళంగోవన్‌రెడ్డి పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు.



చిత్తూరు పార్టీ కార్యాలయంలో

నారా భువనేశ్వరితో కుప్పంలో ప్రచారం చేస్తున్న దగ్గుమళ్ల



చిత్తూరుకు యూనివర్సిటీ.. నాది గ్యారంటీ

- మామిడి రైతుల కోసం మ్యాంగో బోర్డు ఏర్పాటు
- చిత్తూరు దాహార్తిని తీర్చేందుకు అడవిపల్లె ప్రాజెక్టు పనుల పూర్తి

ప్రత్యేక మేనిఫెస్టోను విడుదల చేసిన చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు



గత ఎంపీల తరహాలో ఎమ్మెల్యేల మీద ఆధారపడకుండా నేరుగా తనకంటూ ప్రత్యేక ప్రణాళికను రచించుకుని ముందుకుపోతున్నారు చిత్తూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు. టీడీపీ అధిష్ఠానం ఆయన్ను ఎంపీ అభ్యర్థిగా ప్రకటించినప్పటి నుంచి తన మార్క్ ప్రచారంతో దూసుకుపోతున్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలోని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థులను సమన్వయం చేసుకుని వెళుతున్నారు. ఈయనతో సమానంగా ఆయన కుమారుడు, రాధే కన్‌స్ట్రక్షన్ అధినేత రాధే కూడా ఆయా నియోజకవర్గాల్లో ప్రచారం చేస్తున్నారు. దగ్గుమళ్ల కుటుంబం కూడా ఆయన గెలుపు కోసం రాత్రింబవళ్లు కృషి చేస్తోంది. ఈ నెల 18న దగ్గుమళ్ల కుటుంబ సభ్యులతో ఎలాంటి ఆడంబరాలూ లేకుండా సాదాసీదాగా ఎంపీ అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ఆదర్శంగా నిలిచారు.

- చిత్తూరు

ఈ క్రమంలోనే తాను పోటీ చేస్తున్న చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గానికి ప్రత్యేక మేనిఫెస్టోను రూపొందించారు. శనివారం చిత్తూరు టీడీపీ జిల్లా కార్యాలయం సహా పలుచోట్ల చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే ఏఎస్ మనోహర్, రాధే, కాజూరి బాలాజీ, కాజూరి రాజేష్, టీడీపీ నేత, విశ్రాంత ఎస్పీ చిన్నస్వామి తదితరులు పాల్గొన్నారు. జిల్లా పార్టీ కార్యాలయంలో టీడీపీ నాయకులు దొరబాబు, సీఆర్ రాజన్, గురజాల జగన్మోహన్, చంద్రప్రకాష్, కఠారి హేమలత, సురేంద్రకుమార్, కోదండయాదవ్, సుబ్రి, త్యాగరాజన్, వైవీ రాజేశ్వరిలతో కలిసి మేనిఫెస్టోను విడుదల చేశారు.



చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు



మేనిఫెస్టో లోగోలు

- జిల్లా కేంద్రమైన చిత్తూరులో చెప్పుకోదగ్గ విద్యా సంస్థలులేవు. దీంతో దగ్గుమళ్ల విద్యా ప్రమాణాలను పెంచేందుకు యూనివర్సిటీ ఏర్పాటుకు కృషి చేస్తానన్నారు.
- జిల్లాలో మామిడిసాగు ఎక్కువగా ఉంది. మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకునేందుకు మ్యాంగో బోర్డు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- ప్రస్తుతం చిత్తూరు రైల్వే స్టేషన్‌లో కొన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆగడం లేదు. తాను ఎంపీగా గెలిస్తే ప్రతి ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరులో ఆగేలా చర్యలు తీసుకుంటానని అన్నారు.చిత్తూరు రైల్వే స్టేషన్ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.
- కాట్పాడి నుంచి తిరుపతి వరకు డబుల్ రైల్వే లైన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటానన్నారు.
- చిత్తూరు చుట్టూ జరిగే రోడ్డు ప్రమాదాల బాధితుల కోసం కనీసం ట్రామాకేర్ సెంటర్ కూడా లేదు. తాను గెలిస్తే చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో కచ్చితంగా ట్రామాకేర్ యూనిట్‌ను ఏర్పాటు చేస్తానన్నారు.
- జిల్లా కేంద్రంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.
- చిత్తూరు నగరాన్ని స్మార్ట్‌సిటీగా తీర్చిదిద్దే బాధ్యత తనదే అన్నారు.
- సీఎంసీ ఆస్పత్రికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రోగుల సౌకర్యార్థం ప్రత్యేక హెల్ప్‌లైన్‌ను అందుబాటులోకి తెస్తామన్నారు.
- అడవిపల్లె రిజర్వాయర్ నుంచి చిత్తూరుకు నీళ్లను తీసుకొచ్చి నగర ప్రజల దాహార్తి తీరుస్తామన్నారు.
- చిత్తూరులో ఆటోమొబైల్ పార్కును ఏర్పాటు చేస్తామన్నారు.
- నగరిలో చేనేత కార్మికుల కోసం ప్రత్యేకంగా టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు చేసి అక్కడి భూ గర్భ జలాలు కలుషితం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటానని అన్నారు.
- జిల్లాలోని పశ్చిమ ప్రాంతాల్లో ఏనుగుల బెడద కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ సమస్య నివారణకు బంగారుపాళ్యం నుంచి కుప్పం వరకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో పాటు కందకాలు నిర్మిస్తామన్నారు.

దగ్గుమళ్ల మేనిఫెస్టో ఇలా...

- పలమనేరులోని సిల్క్ ఫామ్ ఆధునికీకరణకు చర్యలు చేపడతామన్నారు.
- జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో వేదపాఠశాల ఏర్పాటుతో పాటు అధునాతన సదుపాయాలతో ఆస్పత్రిని నిర్మిస్తామన్నారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తానని సీఎం జగన్ ప్రతిపక్ష నేతగా హామీ ఇచ్చి మరిచారు. ఎంపీగా గెలిస్తే ఆ నియోజకవర్గంలో కచ్చితంగా ఫైర్ స్టేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.
- గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో లెదర్‌పార్కును ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు మెరుగుపరుస్తానన్నారు.
- పలమనేరు, కుప్పం ప్రాంతాలకు అవసరమైన కోల్డ్ స్టోరేజ్ పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
- చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో పలు నియోజకవర్గ కేంద్రాల్లో జూనియర్, డిగ్రీ, పాలిటెక్నిక్, ఐటీఐ కాలేజీలను ఏర్పాటు చేస్తామన్నారు.
- టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాకు పెద్ద ఎత్తున పరిశ్రమలు వచ్చినప్పటికీ దాన్ని వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఎంపీగా గెలిస్తే ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రత్యేక పారిశ్రామికవాడ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.
- మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక భరోసా ఇస్తామన్నారు.
- గత టీడీపీ ప్రభుత్వం రైతులకు అన్ని రకాల ప్రోత్సాహకాలు అందించి వ్యవసాయాన్ని పండుగలా చేసింది. వ్యవసాయ రంగానికి పూర్వవైభవం తెచ్చేలా డ్రిప్ ఇరిగేషన్ పథకాన్ని మళ్లీ తీసుకొస్తామన్నారు.
- మహిళలకు ఉపాధి కల్పించేందుకు అంతర్జాతీయ సంస్థల ద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేస్తామన్నారు.
- నిరుద్యోగ యువతకు పలు రంగాల్లో నైపుణ్యతను పెంచేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ అకాడమీతో పాటు స్టడీ సర్కిల్స్‌ను తెస్తామన్నారు.
- తరచూ జాబ్‌మేళాలు నిర్వహించి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు.
- జిల్లాలో చెరువులను మరమ్మతులు చేసి భూగర్భ జలాలు పెంచేందుకు కొత్తగా చెక్‌డ్యాములను నిర్మిస్తామన్నారు.
- అడవులను సంరక్షించి పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తామన్నారు.
- క్రీడల కోసం స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణంతోపాటు చిత్తూరులో స్టేడియాన్ని అభివృద్ధి చేస్తానన్నారు.
- ఈడిగ, గౌడ, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల సంక్షేమానికి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రచిస్తామన్నారు.


నా ఎస్సీలు, నా బీసీలు, నా పేదలు.. అంటూ ప్రతి సభలోనూ సీఎం జగన్ చెబుతారు. తాను లేకుంటే వీరికి సంక్షేమమే లేదని మాటలు చెబుతారు. కానీ.. ఆ పేదలకు ఇవ్వాల్సిన రేషన్ బియ్యాన్ని 16 నెలలుగా నిలిపేశారు. ఈ లెక్కన జిల్లాకు 1.36 లక్షల టన్నుల బియ్యాన్ని కార్డుదారులు నష్టపోయారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే తనదిగా రాష్ట్ర ప్రభుత్వం ప్రచారం చేసుకుంటోంది.

- చిత్తూరు కలెక్టరేట్



కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని ఎండీఎస్ వాహనం ద్వారా కార్డుదారులకు పంపిణీ చేస్తున్న సిబ్బంది (ఫైల్ ఫొటో)

పేదల బియ్యం ఎగ్గొట్టిన జగన్



- 16 నెలలుగా రూపాయి బియ్యం నిలిపివేత
- ఉమ్మడి జిల్లాలో 1.36లక్షల టన్నులు ఇవ్వని రాష్ట్రం
- కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్నే తనదిగా ప్రచారం

కొవిడ్ సమయంలో ఉపాధి లేక.. ఇబ్బంది పడుతున్న పేదలను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన' కింద ఉచిత బియ్యం అందిస్తోంది. రేషన్‌లో ఇచ్చే బియ్యం విలువ కిలో రూ.35. అందులో కేంద్రం రూ.30, రాష్ట్రం రూ.5 భరిస్తోంది. కుటుంబంలో ఒకరికి ఐదు కిలోల చొప్పున 2020 ఏప్రిల్ నుంచి ఇస్తోంది. ఇక, రాష్ట్ర ప్రభుత్వం రూపాయికి కిలో బియ్యాన్నీ పంపిణీ చేస్తూ వచ్చింది. ఉచిత బియ్యాన్ని డీలర్ల వద్ద.. నగదుకు బియ్యాన్ని ఎండీఎస్ వాహనాల ద్వారా కార్డుదారులకు ఇస్తూ వచ్చారు. కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని 2022వ సంవత్సరం ఏప్రిల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఆపేసింది. దీనికి ఎలాంటి కారణాలు చూపలేదు. సార్టెక్స్ బియ్యం పేరిట కేంద్రంతో పేచీకి దిగింది. ఉచిత బియ్యం ఇవ్వకపోవడంపై బీజేపీ రాష్ట్ర నాయకులు కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడంతో వారు సీరియస్ అయ్యారు. ఆ తర్వాత జూలై నుంచి ఉచిత బియ్యాన్నీ పునఃప్రారంభించారు. మొత్తమ్మీద 2022వ సంవత్సరం డిసెంబరు వరకు కార్డుదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలిచ్చే ఉచిత.. నగదుకు బియ్యాన్ని (రెండు కోటాలు) ఇచ్చారు.

మేమూ ఉచితంగా ఇస్తామంటూ..



మోసం గురూ!

కేంద్ర ప్రభుత్వం ఉచిత బియ్యం పంపిణీని 2023 డిసెంబరు వరకు పొడిగిస్తూ 2022 చివర్లో నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం కూడా నగదుకు కాకుండా తామూ ఉచితంగానే రేషన్ బియ్యం ఇస్తామని చెప్పింది. కరోనా తీవ్రంగా ఉన్న రోజుల్లోనే ఉచితంగా ఇవ్వని రాష్ట్రం.. కొవిడ్‌లేని సమయంలో ఉచిత ప్రకటన చేయడం వెనుక ఆంతర్యం ఏమిటా అని పలువురు మల్లగుల్లాలు పడ్డారు. ఏమైతేనేం తవకుఉ కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించి రెండు కోటాల బియ్యం ఉచితంగా వస్తాయని కార్డుదారులు భావించారు. అయితే, కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యాన్ని మాత్రమే రేషన్ షాపుల్లో పంపిణీ చేశారు. రాష్ట్ర బియ్యాన్ని ఇవ్వలేదు. ఇక, ఉచిత బియ్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ కేంద్రం 2003 చివర్లో నిర్ణయం తీసుకుంది. ఇలా 16 నెలలుగా కేంద్రం ఇస్తున్న ఉచిత బియ్యంతోనే రాష్ట్రం సరిపెట్టేసింది. ఓహో.. రాష్ట్రం ఇస్తామన్న ఉచితం వెనుక ఇదా కథ అని నెమ్మదిగా కార్డుదారులకు అర్థమైంది.

ఏడాదికి ఓ కుటుంబం నష్టపోయింది 7200 రూపాయలు

కేంద్రం ఇచ్చే బియ్యానికి అదనంగా ఒక్కొక్కరికి ఐదు కిలోల చొప్పున బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమూ ఇవ్వాలి. అలా.. నలుగురు కుటుంబ సభ్యులున్న కుటుంబానికి రూ.20కి 20 కిలోల బియ్యం ఇచ్చుంటే నెలకు సరిపేడది. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రస్తుత బహిరంగ మార్కెట్‌లో కిలో బియ్యం రూ.40 నుంచి రూ.70 వరకు పలుకుతోంది. రేషన్ బియ్యం ధర రూ.30 అనుకున్నా.. నలుగురున్న కుటుంబానికి నెలకు రూ.600 .. ఏడాదికి రూ.7200 నష్టపోయినట్లే. అసలే నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, విద్యుత్ ఛార్జీల మోత, ఆస్తి పన్ను బాదుడుతో సతమతమవుతున్న పేదలకు.. రాష్ట్రం కోటా రేషన్ బియ్యం కూడా పంపిణీ చేసుంటే కొంత ఊరటగా ఉండేది.

పేదలకు ఇవ్వని 1.36 లక్షల టన్నుల బియ్యం

ఉమ్మడి జిల్లాలో సరాసరి 5.30 లక్షల రేషన్‌కార్డులు చెలామణిలో ఉన్నాయి. నెలకు 8500 టన్నుల ఉచిత బియ్యం అవసరం. 2023 జనవరి నుంచి 2024 ఏప్రిల్ వరకు 16 నెలలపాటు.. నెలకు 8500 టన్నుల వంతున 1.36లక్షల టన్నుల బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా ఎగ్గొట్టింది. కేంద్రం ఇస్తున్న బియ్యాన్నే తాము ఉచితంగా ఇస్తున్నట్లు బిల్డప్ ఇస్తూవచ్చింది.

ఏ మొహం పెట్టుకుని ఓటడుగుతావు స్వామీ?

డిప్యూటీ సీఎంను ప్రశ్నించిన వైసీపీ సర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి

పెనుమూరు, ఏప్రిల్ 20: ఐదేళ్లలో శాతంబాకం పంచాయతీకి ఏమి ఒరగబెట్టావని ఓటు అడగటానికి వస్తున్నావని డిప్యూటీ సీఎం నారాయణస్వామిని శాతంబాకం వైసీపీ సర్పంచ్ అభ్యర్థి సోమశేఖర్‌రెడ్డి నిలదీశారు. ఈ మేరకు ఆయన వీడియో విడుదల చేశారు. వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడి పనిచేశామని, అలాంటిది శాతంబాకం సర్పంచ్‌గా పోటీ చేస్తే నారాయణస్వామి పార్టీకి ఓటు వేయని వారిని తనపై పోటీకి నిలబెట్టాడని, ఇదేంటని ఇంటికెళ్లి అడిగితే బయటకు వెళ్లమన్నాడని, ఇప్పుడు ఏ మొహం పెట్టుకుని తమ గ్రామానికి వస్తున్నావని అడిగారు. రాజశేఖరరెడ్డి విగ్రహం పెడితే దాన్ని ధ్వంసం చేయడానికి ప్రయత్నించిన వారిని పక్కన పెట్టి పార్టీకి కష్టపడిన తమను ఇబ్బందులు పెట్టడం బాధ కలిగించిందని అన్నారు. పార్టీని నమ్ముకుని ఆర్థికంగా చితికిపోయి ఊరు వదిలి వెళ్లే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా బాబు జన్మదిన వేడుకలు

- భువనేశ్వరి పూజలు, కేక్ కటింగ్‌లు, అన్నదానాలు

కుప్పం, ఏప్రిల్ 20: తెలుగుదేశం పార్టీ అధినేత, ప్రతిపక్ష నేత నారా చంద్రబాబునాయుడు 75వ జన్మదిన వేడుకలు కుప్పంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం కుప్పం వచ్చిన ఆయన సతీమణి నారా భువనేశ్వరి ఈ వేడుకల్లో పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. సామగుట్టపల్లెలోని కదిరి నరసింహస్వామి ఆలయంలో ఉదయం ఆమె చంద్రబాబు పేరుమీద పూజలు చేయించారు. ఆలయం బయట సూపర్ సిక్స్ పథకాలతో కూడిన భారీ కేక్ కట్ చేసి, పార్టీ కార్యకర్తలతో కలిసి సంబరాలు జరుపుకున్నారు. మధ్యాహ్నం ఆర్టీసీ బస్టాండు సర్కిల్‌లో అన్న క్యాంటీన్ ద్వారా పేదలకు అన్నదానం చేశారు. ఇక్కడ కూడా కేక్ కట్ చేశారు. అంతకుముందు పార్టీ కార్యాలయంలో ముస్లిం మైనారిటీ మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. కదిరి నరసింహస్వామి ఆలయంలో పూజల అనంతరం భువనేశ్వరి మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడూ తన జన్మదిన వేడుకలను ప్రజల్లోనే జరుపుకుంటారని చెప్పారు. వారి బాగోగులు, రాష్ట్ర అభివృద్ధి కోసమే ఆయన నిరంతరం తపన పడుతుంటారన్నారు. దేశ, విదేశాల్లో సైతం ప్రజలు ఆయన పేరుతో పూజలు చేయిస్తుండడం సంతోషం కలిగిస్తోందన్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పీఎస్.మునిరత్నం, నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబు, చంద్రబాబు వ్యక్తిగత కార్యదర్శి పి.మనోహర్, నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా, పార్టీ కుప్పం మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అన్నదానం చేస్తున్న భువనేశ్వరి



కదిరి నరసింహస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భువనేశ్వరి

సూపర్ సిక్స్ పథకాలతో బాబు జన్మదిన కేక్

కుప్పం, ఏప్రిల్ 20: టీడీపీ అధినేత చంద్రబాబు జన్మదినం సందర్భంగా కుప్పంలో శనివారం ఏర్పాటు చేసిన సూపర్ సిక్స్ పథకాలతో కూడిన 74 కేజీల కేక్ ఆకట్టుకుంది. భారీ కేక్‌పై మళ్లీ ఆరు చిన్నచిన్న కేక్‌లను అమర్చి తయారు చేశారు. ఆ చిన్న కేక్‌లపై మినీ మ్యానిఫెస్టో, చంద్రబాబు, భువనేశ్వరి జంట ఫొటోను అమర్చారు.



బొండా ఉమకు జగన్ వేధింపులు: అచ్చెన్న

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): 'ఎన్డీయే కూటమి అభ్యర్థిగా నామినేషన్ వేసిన బొండా ఉమను, జగన్ కావాలనే వేధిస్తున్నారు. గులకరాయి కేసులో సీపీ ప్రకటనపై ఎన్నికల సంఘం విచారణకు ఆదేశించాలి' అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థిని వేధించడంపై హైకోర్టు చీఫ్ జస్టిస్, ప్రధాన ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. కాగా, కాపుల్ని అణిచివేయడమే లక్ష్యంగా జగన్ అడుగడుగునా కుట్రలకు తెరలేపుతున్నారని టీడీపీ ఎమ్మెల్యేలు నిమ్మకాయల చినరాజప్ప, గంటా శ్రీనివాసరావు, నిమ్మల రామానాయుడు ఆరోపించారు. కాపు నాయకుల్ని ఏకంగా ఎన్నికల్లో నిలబడనీయకుండా చేసేందుకు కుట్రలు చేస్తున్నారని గులకరాయి దాడి ఘటనతో సంబంధం లేని బీసీ బిడ్డను బలిచ్చి, ఆ కేసులో కాపుల్ని కూడా ఇరికించే కుట్రచేయడం దుర్మార్గమని అన్నారు.

పింఛన్లు ఇళ్ల వద్దే పంపిణీ చేయాలి: దేవినేని

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): పేదల పింఛన్లు ఈసారి ఇళ్ల వద్దే పంపిణీ చేయాలని టీడీపీ డిమాండ్ చేసింది. తీవ్రమైన ఎండల్లో పోయిన నెలలో వృద్ధ పింఛనుదారులను గ్రామ, వార్డు సచివాలయాల చుట్టూ తిప్పడంతో ప్రభుత్వ లెక్కల ప్రకారమే 60 మంది వృద్ధులు వడ దెబ్బకు ప్రాణాలు కోల్పోయారని, మళ్లీ ఆ పరిస్థితి రాకుండా చూడాలని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి దేవినేని ఉమామహేశ్వరరావు కోరారు. సీఎం జగన్, పేద పింఛనుదారులతో శవ రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎండలో తిరిగి ఒక్క పింఛనుదారుడు కూడా మృత్యువాత పడకుండా చూడాలని ఉమా కోరారు.

పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ కుట్రలు

» బొండా అక్రమ అరెస్టుకు యత్నాలు: సీఈసీకి వర్ల లేఖ

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రక్రియను అపహాస్యం చేసేందుకు వైసీపీ ప్రభుత్వం పోలీసులను వాడుకుంటోందని కేంద్ర ఎన్నికల సంఘానికి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్య ఫిర్యాదు చేశారు. శనివారం ఈ మేరకు సీఈసీకి లేఖ రాశారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినా అధికార వైసీపీ చేతిలోనే పోలీసు యంత్రాంగం పని చేస్తోందని ఆరోపించారు. ప్రత్యర్థులను వేధించడానికి వైసీపీ అభ్యర్థులు పోలీసులను అస్త్రంగా చేసుకున్నారని పేర్కొన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక ఈసీ బృందాలు వచ్చి పోలీసుల పని తీరుపై పరిశీలించాలని, అప్పుడే ఎన్నికలు శాంతియుత వాతావరణంలో జరుగుతాయని సూచించారు. ప్రకాశం జిల్లా కొండెపి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆదిమూలపు సురేష్ ఈ నెల 19న నామినేషన్ దాఖలు చేశారని, సురేష్ భార్య ఐఆర్ఎస్ అధికారి విజయలక్ష్మి కూడా ఆ కార్యక్రమంలో పాల్గొని ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని వర్ల తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఐఆర్ఎస్ అధికారి విజయలక్ష్మిపై చర్యలు తీసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. శనివారం అమరావతి సచివాలయంలో ఆయన రాష్ట్ర ఎన్నికల అదనపు ప్రధానాధికారి హరీంధర ప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ... గులకరాయి దాడి ఘటనలో సీపీ, ఐజీ, డీజీపీ సహా అందరూ డ్రామాలాడుతున్నారని విమర్శించారు.

సూర్యనారాయణపై మల్లాది విష్ణు ఫిర్యాదు

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నేత కేఆర్ సూర్యనారాయణ ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తున్నారని, ఆయనపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వైసీపీ ఎమ్మెల్సీ మల్లాది విష్ణు అన్నారు. ఈ మేరకు అదనపు ప్రధాన ఎన్నికల అధికారి హరీంధర ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు.

అనాథ బాలికలతో వైసీపీ ఎన్నికల ప్రచారం

నూజివీడు, ఏప్రిల్ 20: ఏలూరు జిల్లా నూజివీడులో అనాథ బాలికలకు ప్రభుత్వ, ప్రైవేట్ నిధులతో వైసీపీ నాయకుడు బసవరాజు నగేష్ ఆధ్వర్యంలో హోమ్(హాస్టల్) నిర్వహిస్తున్నారు. ఇక్కడ సుమారు 100మంది బాలికలు భోజన, వసతి పొందుతూ ప్రభుత్వ పాఠశాలలు/జూనియర్ కళాశాలల్లో చదువుకుంటున్నారు. శుక్రవారం రాత్రి వైసీపీ అభ్యర్థి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పాతరావిచర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారానికి రాగా, ఆయనకు వీరవిధేయుడైన నగేష్.. అనాథ బాలికలను వాహనంలో తరలించారు. బాలికలకు వైసీపీ కండువాలు కప్పి గ్రామంలో ఎన్నికల ప్రచారం చేయించారు. దీనిపై నూజివీడు జనసేన నాయకుడు ముత్యాల కామేష్ నూజివీడు ఆర్డీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వై.భవానీ శంకరికి ఫిర్యాదు చేశారు.

జగన్‌కు బుద్ధి చెబుతాం: మంద కృష్ణ మాదిగ

ధర్మవరం, ఏప్రిల్ 20: వైసీపీ పాలనలో మాదిగలకు అన్నింటా అన్యాయం జరిగిందని, ఈ ఎన్నికల్లో జగన్‌కు బుద్ధి చెబుతామని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హెచ్చరించారు. శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల సదస్సులో ఆయన ప్రసంగించారు. మాదిగలపై దాడులు చేస్తున్న జగన్‌కు బుద్ధి చెప్పాలంటే టీడీపీ, బీజేపీ, జనసేన అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

'ఇండియా' అభ్యర్థులను గెలిపించండి: సీపీఐ

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 20: ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం గత పదేళ్లలో రాష్ట్రానికి బొట్టు సాయం కూడా చేయలేదన్నారు. సీఎం జగన్ తరచూ ఢిల్లీ పెద్దల వద్దకు వెళ్లి తన కేసులు మాఫీ చేయాలని కాళ్లు పట్టుకోవడమే తప్ప, రాష్ట్ర అభివృద్ధి కోసం అడిగింది లేదన్నారు.

'దేవదాయ'లో కొట్టు దాష్టీకం

» ఆ సిబ్బందిని సస్పెండ్ చేయండి
» ప్రభుత్వంపై కోర్టుకు వెళ్లడమే వాళ్ల నేరం
» పదోన్నతులపై అపరిష్కృతంగా వివాదం
» మంత్రి తీరుతో కొందరికి అన్యాయం
» వారు కోర్టుకు వెళ్లడంపై కొట్టు కన్నెర్ర
» చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి లేఖ

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వారంలో సీపీఎస్ రద్దు చేస్తానంటూ ఇచ్చిన హామీలను అమలు చేయండి అని కోరినందుకు ఉద్యోగులను జగన్ రోడ్డుమీదకు లాగారు. దేవదాయ శాఖలో చట్టబద్ధమైన హక్కులు కోరినందుకు సిబ్బందిని ఏకంగా సస్పెండ్ చేసేయాలంటున్నారు ఆ శాఖ మంత్రి. జగన్ చూపిన దారిలో మరింతగా దూకుడుగా వెళ్తోన్న కొట్టు సత్యనారాయణ చర్యలు ఎన్నికల వేళ ఉద్యోగ, అధికార వర్గాలను ఉడికిస్తున్నాయి.



ఉద్యోగులకు ప్రభుత్వమే బాస్. అలాగని ప్రభుత్వం చేసే అన్యాయమైన, అడ్డగోలు పనులను ఉద్యోగులు భరించాల్సిన పనిలేదు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల అన్యాయం జరుగుతుందనుకుంటే ఉద్యోగులు కోర్టులకు వెళ్లి న్యాయ పోరాటం చేయవచ్చు. ఇది వారికి రాజ్యాంగం కల్పించిన హక్కు. కానీ, అవేవీ తన ముందు చెల్లవంటున్నారు దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ. తాను చెప్పిందే వేదం అంటున్న ఆయన, తాను చేసిన శాసనం పాటించి తీరాల్సిందేనని కన్నెర్ర చేస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళితే.. దేవదాయశాఖలో పదోన్నతుల వ్యవహారం తీవ్రంగా ముదిరిపోయింది. డైరెక్ట్ రిక్రూటీలు, ప్రమోటీ అధికారుల మధ్య పదోన్నతుల విషయంలో విభజన రేఖను తీసుకొచ్చేలా ఆ శాఖ చర్యలున్నాయి. ఆ శాఖ మంత్రిగా కొట్టు సత్యనారాయణ ఇరువర్గాలను కూర్చోబెట్టి తెలివిగా సమస్య పరిష్కరించాలి. ఉద్యోగులు, అధికారులకు న్యాయబద్ధమైన పదోన్నతులు దక్కేలా మంత్రి చూడాలి. మంత్రికి అది సాధ్యంకాలేదు. సహజంగానే కొందరికే మేలు జరిగింది. నష్టపోయిన వారు కోర్టుకెళ్లారు. కోర్టుకెళ్లి న్యాయం పొందడం ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి హక్కు. అయితే, ఉద్యోగుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మంత్రిది. అందుకు భిన్నంగా ఉన్న ఆయన తీరుతో నష్టపోయే అధికారులు కోర్టును ఆశ్రయించారు. ఇది మంత్రి కొట్టుకు నచ్చనే లేదు. దీంతో కోర్టుకు వెళ్లినవారిని సస్పెండ్ చేయాలంటూ దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని ఆదేశిస్తూ మంత్రి ఇటీవల లేఖ రాశారు. "హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేయడం ద్వారా ఇటీవల దేవదాయశాఖలో సీనియర్ అధికారులకు ఇచ్చిన పదోన్నతులను అడ్డుకోవాలని చూశారు. వారి చర్యలతో దేవాదాయశాఖను తీవ్ర అసౌకర్యానికి గురిచేశారు. శాఖలోని పలువురు అధికారులపై వారు క్రమం తప్పకుండా తప్పుడు ప్రచారం చేస్తున్నారని నా దృష్టికి వచ్చింది. వారిపై అనేక అభియోగాలు నమోదైనట్లు తెలిసింది. కాబట్టి వారిని తక్షణమే సస్పెండ్ చేయాలి" అని ఆ లేఖలో ఆదేశించారు. అయితే, ఇది మంత్రిగా కొట్టు చేయాల్సిన పనికాదని ఐఏఎస్‌లు అభిప్రాయపడుతున్నారు. "న్యాయం కోరుతూ కోర్టుకెళ్లిన వారినల్లా సస్పెండ్ చేసుకుంటూ పోతే ప్రభుత్వంలో సగం మంది ఉద్యోగులు ఇంట్లో కూర్చోవాల్సి వస్తుంది. దీని వల్ల పాలనా సంక్షోభం వస్తుంది. ఉద్యోగుల సమస్యలను సామరస్యకోణంలో చూడాలి. ఎవరైనా అతిగా వ్యవహరిస్తే పిలిచి మాట్లాడాలి. అంతే తప్ప కోర్టుకెళ్లారు కాబట్టి సస్పెండ్ చేయమంటే అది నియంతృత్వ చర్య కిందకు వస్తుంది. ఉద్యోగులంటే చిన్నచూపు ఉన్న దురంహకారులే అలాంటి పనులు చేస్తుంటారు" అని సీనియర్ ఐఏఎస్ అధికారి ఒకరు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.అందరికీ ఆమోదయోగ్యమైన పదోన్నతులు ఇవ్వలేకపోయినందుకు మంత్రిపై ఏం చర్యలు తీసుకోవాలని మరో సీనియర్ అధికారి ప్రశ్నించారు.

పదోన్నతుల్లో అక్రమాలు..

దేవదాయ శాఖ ఈ మధ్య కాలంలో పదోన్నతులన్నీ అక్రమంగానే ఇచ్చింది. సీనియర్లను పక్కన పెట్టి, నిబంధనలు పాటించకుండా అడ్డగోలుగా పదోన్నతులు కల్పించారు. అసిస్టెంట్ కమిషనర్ నుంచి డిప్యూటీ కమిషనర్ వరకు పదోన్నతుల్లో మరీ దారుణంగా ప్రవర్తించారు. కేవలం మంత్రి అండదండలతోనే సీనియారిటీ లిస్ట్ కూడా సక్రమంగా విడుదల చేయకుండా మంత్రికి నచ్చి, ఆయన మెచ్చిన వారికి పదోన్నతులు ఇచ్చేశారు. అధికారులు కూడా ఇది తప్పు అని చెప్పకుండా, మంత్రి చెప్పింది చెప్పినట్లు చేసుకుంటూ వెళ్లారు. ఏసీ నుంచి డీసీ, గ్రేడ్ - 1 నుంచి ఏసీ పదోన్నతులు... మొత్తం ఇలానే ఇచ్చేశారు. చివరికి కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయలేదు. పదోన్నతుల విషయంలో నిబంధనలు పాటించి, సీనియారిటీని పరిగణనలోకి తీసుకోవాలని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ హైకోర్టు ఆదేశాలను కూడా మంత్రి, అధికారులు తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా పదోన్నతులు కల్పించారు. పైగా కోర్టుకు వెళ్లిన అధికారులను సస్పెండ్ చేయాలంటూ లేఖ ద్వారా బెదిరింపులకు గురి చేశారు.

విశాఖ ఉక్కు విలవిల..!

» బొగ్గులేక రోజుకు 4వేల టన్నులే ఉత్పత్తి
» సహకరించని అదానీ గంగవరం పోర్టు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)



విశాఖపట్నం స్టీల్‌ప్లాంటు పరిస్థితి వెంటిలేటర్ తీసేసి ఆక్సిజన్‌తో ఊపిరి పీల్చుకునే రోగి మాదిరిగా ఉంది. పది రోజులుగా అదానీ గంగవరం పోర్టు నుంచి ప్లాంటుకు బొగ్గు, ఇతర ముడి పదార్థాల సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దీంతో అరకొర ఉత్పత్తికే విలవిల్లాడుతోంది. అదానీ పోర్టులో కార్మికుల మెరుపు సమ్మె కారణంగా అక్కడ ఎగుమతి, దిగుమతి ఆపరేషన్లు పూర్తిగా నిలిచిపోయాయి. కార్మికులను ఏదో ఒక విధంగా ఒప్పించి విధుల్లోకి తీసుకోవలసిన యాజమాన్యం మొండి వైఖరితో చర్చలు కొనసాగించడం లేదు. ఏదైనా నష్టం జరిగితే పోర్టుపై ఆధారపడిన పరిశ్రమలే నష్టపోతాయనే భావనతో ఉంది. ఈ నేపథ్యంలో బొగ్గు అందక స్టీల్‌ప్లాంటులో కోక్ ఓవెన్ బ్యాటరీల పరిస్థితి బాగా దిగజారిపోయింది. వాటిని నిత్యం అధిక ఉష్ణోగ్రతల వద్ద నిర్వహించడానికి ఉక్కు యాజమాన్యం నానాపాట్లు పడుతోంది. సెయిల్ నుంచి 8వేల టన్నుల బొగ్గు అప్పుగా తీసుకొచ్చింది. పారదీప్ పోర్టులో కొంత బొగ్గు ఉందని తెలిసి వారితో చర్చలు జరుపుతోంది. అదానీ పోర్టు నుంచి విశాఖపట్నం పోర్టుకు తరలించిన నౌకల్లో ఒక దాని నుంచి శనివారం సాయంత్రం బొగ్గును దిగుమతి చేయడం ప్రారంభించారు. అది సోమవారం నాటికి ప్లాంటుకు చేరే అవకాశం ఉంది. అంతవరకు కోక్ ఓవెన్లను నిర్వహించడం, వాటిని ఆ తర్వాత సాధారణ స్థితికి తీసుకురావడం ఎంతవరకు సాధ్యమవుతుందో చెప్పలేమని అధికార వర్గాలు చెబుతున్నాయి. మూడు బ్లాస్ట్ ఫర్నేసు (బీఎఫ్)ల ద్వారా రోజుకు 20వేల టన్నుల స్టీల్ ఉత్పత్తి చేయాల్సి ఉండగా మొన్నటివరకు రెండు బీఎఫ్‌లు మూసేశారు. అలా చేయడం కూడా నష్టమేనని మేల్కొని ఇప్పుడు రెండింటిని అతి కష్టం మీద నడుపుతూ రోజుకు 4వేల టన్నుల ఉత్పత్తి చేస్తున్నారు. బొగ్గు, ముడి ఇనుము, లైమ్ స్టోన్, అన్నీ పూర్తిస్థాయిలో సమకూరితే తప్ప ప్లాంటు పూర్వస్థితికి వచ్చే అవకాశం లేదు. దీనికి ఎన్ని రోజులు పడుతుందో అంచనా వేయలేకపోతున్నారు. అదానీ పోర్టు మొండిగా వ్యవహరిస్తూ కార్మికుల సమ్మెకు పరోక్షంగా మద్దతు ఇస్తున్నదనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.

హుద్‌హుద్ సమయంలోనూ ఈ పరిస్థితి లేదు

విశాఖపట్నం స్టీల్‌ప్లాంటుకు ఇలాంటి గడ్డు పరిస్థితి గత మూడున్నర దశాబ్దాల కాలంలో ఎప్పుడూ ఎదురుకాలేదు. హుద్‌హుద్ తుఫాన్ సమయంలో కూడా విద్యుత్ సరఫరా రెండు రోజులే ఆగింది. మూడో రోజుకు సరఫరా పునరుద్ధరించి, యార్డులో ముడి పదార్థాలన్నీ తరలించడంతో నాలుగో రోజు నుంచి ఉత్పత్తి సాధారణ స్థితికి వచ్చింది. కానీ, పది రోజుల పాటు బొగ్గు సరఫరా లేకుండా కోక్‌ఓవెన్లను, బీఎఫ్‌లను నిర్వహించడం ఇదే తొలిసారని, దీనివల్ల సమీప భవిష్యత్తులో వీటి మరమ్మతులకు ఎన్ని వందల కోట్ల రూపాయలు వెచ్చించాల్సి వస్తుందోనని ఉద్యోగ, కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

బాబుతో అభివృద్ధి.. జగన్‌తో విధ్వంసం

» టీడీపీ రాజ్యసభ సభ్యుడు కనకమేడల
» బొండాను ఇరికించాలని చూస్తున్నారని ఈసీకి ఫిర్యాదు

న్యూఢిల్లీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఏపీ సీఎం జగన్‌ది ఫ్యాక్షన్ పాలన అని టీడీపీ మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ విమర్శించారు. టీడీపీ అధినేత చంద్రబాబు పాలనలో అభివృద్ధి జరిగితే జగన్ పాలనలో విధ్వంసం తప్ప మరేమీ కానరావట్లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం చంద్రబాబునాయుడు జన్మదిన వేడుకలను శనివారం తన నివాసంలో కనకమేడల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీ రాజకీయాల్లో చంద్రబాబు చెరగని ముద్ర వేశారన్నారు. ఆయన పుట్టినరోజు రాష్ట్ర ప్రజలకు, తెలుగు వారందరికీ ఒక పండగన్నారు. అభివృద్ధి సంక్షేమం, సంపద సృష్టికి చంద్రబాబు నాయుడు ఒక బ్రాండ్ అని కొనియాడారు. ప్రపంచంలో ఎక్కడ లేని విధంగా ఏపీలో రాజధాని కొరకు భూమి సేకరించారని దాని ఫలితమే అమరావతి రాజధాని తెలిపారు. జగన్ మాత్రం తన విధ్వంసకర ఆలోచనలతో అమరావతిని తిరోగమనంలోకి తీసుకెళ్లారని దుయ్యబట్టారు. కాగా, సీఎం జగన్‌పై రాయి దాడి కేసులో టీడీపీ నేత బొండా ఉమాను ఇరికించే ప్రయత్నాలు చేస్తున్నారని ఈసీకి కనకమేడల లేఖ రాశారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న బొండా ఉమాను నిలువరించేందుకు అరెస్టు చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలిపారు. ఎన్నికల కమిషన్ జోక్యం చేసుకోవాలంటూ విజయవాడ పోలీసులు వ్యవహరిస్తున్న తీరుపై ఈసీకి ఫిర్యాదు చేశారు.

ముగ్గురు పిల్లలతో కలిసి మహిళ ఆత్మహత్య

» భర్త వివాహేతర సంబంధమే కారణం
» మృతురాలి భర్త వలంటీర్... కేసు నమోదు



నాగరాణి, ఆమె ముగ్గురు పిల్లలు

గాలివీడు, ఏప్రిల్ 20: భర్త వివాహేతర సంబంధంతో మనస్తాపానికి గురైన భార్య ముగ్గురు పిల్లలతో కలసి నీటిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ విషాద ఘటన శుక్రవారం రాత్రి అన్నమయ్య జిల్లా గాలివీడులో జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. గాలివీడుకు చెందిన వేముల విక్రమ్‌కు రామాపురం మండలం చిట్లూరు పంచాయతీకి చెందిన నాగరాణి (30)తో 12ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి నవ్యశ్రీ(10), దినేశ్(6), జాన్వి(3) అనే ముగ్గురు పిల్లలు ఉన్నారు. విక్రమ్ గ్రామ వలంటీర్‌గా పనిచేస్తూనే ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రెండేళ్ల క్రితం మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. అప్పటి నుంచి భార్యభర్తల మధ్య తరచూ గొడవలు జరిగేవి. రెండు రోజుల క్రితం ఆ మహిళకు బిడ్డ పుట్టిన విషయం తెలియడంతో వారిమధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. తీవ్ర మనస్తాపానికి గురైన నాగరాణి శుక్రవారం రాత్రి 8గంటల సమయంలో ముగ్గురు పిల్లలను తీసుకొని ఇంటి నుంచి వెళ్లిపోయింది. తన ఆవేదనంతా ఫోన్‌తో తల్లికి వివరించింది. అనంతరం వెలిగల్లు ప్రాజెక్టుకు దిగువనున్న గండిమడుగులో పిల్లలను తోసేసి ఆమె కూడా దూకింది. రాత్రి 10గంటల సమయంలో ఆమె తల్లి గాలివీడుకు చేరుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, నాగరాణి కుటుంబ సభ్యులు గాలించగా.. గండిమడుగులో నవ్య, దినేశ్ మృతదేహాలు నీటిలో తేలుతూ కనిపించడంతో బయటికి తీశారు. అనంతరం జాలర్ల సాయంతో నాగరాణి, జాన్వి మృతదేహాలను కూడా వెలికితీశారు. మృతురాలి భర్త విక్రమ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు.

ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా చేతన్

అమరావతి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ బేవరేజెస్ కార్పొరేషన్ ఎండీగా 2016 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి టి.ఎస్.చేతన్‌ను కేంద్ర ఎన్నికల సంఘం నియమించింది. ప్రస్తుతం ఆయన ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఇప్పటి వరకు ఆ స్థానంలో ఉన్న వాసుదేవరెడ్డిని ఆరోపణల నేపథ్యంలో ఈసీ తొలగించింది. ఈసీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయాల్సి ఉంది.

మద్యం పారిస్తున్న వైసీపీ: రామకృష్ణ

అమరావతి, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో అధికార వైసీపీ మద్యాన్ని ఏరులై పారిస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆరోపించారు. మద్యాన్ని నిషేధించిన తర్వాత మాత్రమే ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న సీఎం జగన్ మాట తప్పి, మడమ తిప్పేశారని శనివారం ఎద్దేవా చేశారు. అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా జనసమీకరణకు వైసీపీ పెద్ద ఎత్తున మద్యం, డబ్బులు పంపిణీ చేస్తోందని ఆరోపించారు. ఎన్నికల కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టి ఎన్నికల్లో మద్యం, డబ్బు పంపిణీని నివారించి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

అభివృద్ధి ఏది మంత్రివర్యా!

» ఎన్నికల ప్రచారంలో అప్పలరాజును నిలదీసిన జనం

పలాస, ఏప్రిల్ 20: శ్రీకాకుళం జిల్లా పలాసలో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి సీదిరి అప్పలరాజుకు స్థానికుల నుంచి నిలదీత ఎదురైంది. ఆరోవార్డు పెసరపాడులో చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని మాజీ కౌన్సిలర్ సంపతిరావు ధనుంజయ్, స్థానికులు మంత్రి అప్పలరాజును నిలదీశారు. దీంతో మంత్రి అనుచరులు కలుగజేసుకుని.. వైసీపీని వీడి టీడీపీలో చేరిన నీకు అభివృద్ధిపై ప్రశ్నించే అర్హత లేదంటూ ఆయనను పక్కకు తోసేయడంతో స్వల్ప ఉద్రిక్తత నెలకొంది. స్థానికులు, పోలీసులు ఇరువర్గాలకు నచ్చజెప్పడంతో పరిస్థితి సద్దుమణిగింది. విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, దువ్వాడ శ్రీకాంత్ చేరుకొని ధనుంజయ్‌కు సంఘీభావం ప్రకటించారు.

నవ్య | చిత్రజ్యోతి

హను-మాన్ కంటే పెద్ద విజయం సాధించాలి



ప్రియదర్శి, నభా నటేశ్ జంటగా ఓ చిత్రం తెరకెక్కుతోంది. ఈ రొమాంటిక్ కామెడీ చిత్రానికి అశ్విన్‌రామ్ దర్శకత్వం వహిస్తున్నారు. కె.నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. శనివారం ఈ మూవీ టైటిల్‌ను, ప్రోమోను మేకర్స్ విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'డార్లింగ్', ఉపశీర్షిక 'వై దిస్ కొలవెరి'. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రశాంత్ వర్మ మాట్లాడుతూ 'డార్లింగ్' సినిమా 'హను-మాన్' కంటే పెద్ద విజయం సాధించాలి" అని అన్నారు. నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని చెప్పారు. హీరో ప్రియదర్శి మాట్లాడుతూ "ప్రేక్షకులకు కావాల్సిన కంప్లీట్ ఎంటర్టైన్‌మెంట్ ఈ సినిమా" అని చెప్పారు. దర్శకుడు అశ్విన్‌రామ్ మాట్లాడుతూ "ఈ సినిమా కపుల్స్‌కి, లవర్స్‌కి ఖచ్చితంగా కనెక్ట్ అవుతుంది" అని చెప్పారు.

ఎమోషన్స్, యాక్షన్ మెప్పించాయి

చిరంజీవి



కార్తికేయ గుమ్మకొండ కథానాయకుడిగా నటిస్తున్న 'భజే వాయువేగం' చిత్రం టీజర్‌ను శనివారం చిరంజీవి ఆవిష్కరించారు. 'విశ్వంభర' సెట్‌లో చిత్రబృందం చిరంజీవిని కలిసింది. 'నా అభిమాని, తమ్ముడు లాంటి కార్తికేయ నటించిన 'భజే వాయువేగం' చిత్రం టీజర్‌తోపాటు టైటిల్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి. ఎమోషన్స్‌తో పాటు యాక్షన్ అంశాలు ఆకట్టుకున్నాయి. ఈ సినిమా ఘన విజయం అందుకోవాలి' అని ఈ సందర్భంగా చిరంజీవి ఆకాంక్షించారు. డ్రగ్స్ కేసులో పోలీసుల ఇన్వెస్టిగేషన్, తండ్రీ కొడుకుల అనుబంధం నేపథ్యంలో సాగిన టీజర్ ఆద్యంతం అలరించింది. యాక్షన్ సీక్వెన్స్‌ల్లో కార్తికేయ విజృంభించారు. ఆయనకు జోడీగా ఐశ్వర్య మీనన్ నటిస్తున్నారు. రాహుల్ టైసన్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రశాంత్‌రెడ్డి చంద్రపు దర్శకత్వంలో యూవీ కాన్సెప్ట్స్ నిర్మిస్తోంది. త్వరలో మేకర్స్ విడుదల తేదీని ప్రకటించనున్నారు. ఈ చిత్రానికి సంగీతం: రధన్, కపిల్ కుమార్. సినిమాటోగ్రఫీ: ఆర్. డి. రాజశేఖర్

పైసా వసూల్ సినిమా అవుతుంది

విశాల్



విశాల్, ప్రియా భవానీ నటించిన చిత్రం 'రత్నం'. విశాల్‌తో 'భరణి', 'పూజ' చిత్రాలు చేసిన డైరెక్టర్ హరి ఈ సినిమాను తెరకెక్కించారు. కార్తికేయన్ సంతానం నిర్మించారు. ఈ నెల 26న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా విశాల్ మీడియాతో ముచ్చటించారు. "యాక్షన్ ఎంటర్టైనర్‌గా తెరకెక్కిన ఈ సినిమా అందరినీ అలరిస్తుంది. ఇందులో కేవలం మాస్ ఎలిమెంట్స్ మాత్రమే కాకుండా ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకునే అంశాలు చాలా ఉన్నాయి. దేవిశ్రీ ప్రసాద్ ఈ సినిమాకు మంచి సంగీతం ఇచ్చారు. ఇందులోని కంటెంట్, డైలాగ్స్ వల్ల అందరికీ ఇది స్ట్రయిట్ తెలుగు సినిమాలాగే అనిపిస్తోండటం సంతోషంగా ఉంది. హరి సినిమాల్లో హీరో పాత్ర కంటే హీరోయిన్‌కే అధిక ప్రాముఖ్యత ఉంటుంది. ఇందులో ప్రియా భవానీ శంకర్ పాత్ర తీరు అందరినీ ఆకట్టుకుంటుంది. మీరు పెట్టే డబ్బులకు సరిపడా వినోదం ఇస్తాం. కచ్చితంగా పైసా వసూల్ సినిమా అవుతుంది" అని చెప్పారు.

హరోం హరకు ప్యాకప్



సుధీర్‌బాబు కథానాయకుడిగా రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'హరోం హర'. 'ది రివోల్ట్' అనేది ట్యాగ్‌లైన్. జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వంలో సుమంత్ జి. నాయుడు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం షూటింగ్ పూర్తయినట్టు మేకర్స్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా సెట్‌లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసిన వీడియోను చిత్రబృందం సోషల్ మీడియాలో షేర్ చేసింది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. చిత్తూరు జిల్లా కుప్పంలో 80వ దశకంలో జరిగిన సంఘటనల ఆధారంగా 'హరోం హర' తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో మాళవిక శర్మ కథానాయికగా నటిస్తున్నారు. సునీల్ కీలకపాత్ర పోషిస్తున్నారు. చైతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తున్నారు.

ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం...

ఛోటా కే నాయుడుకు దర్శకుడు హరీశ్ శంకర్ హెచ్చరిక



'ఎప్పుడైనా, ఎక్కడైనా సిద్ధం... మీ పిలుపు కోసం ఎదురు చూస్తుంటాను' అంటూ సినిమాటోగ్రాఫర్ ఛోటా కే నాయుడుకు దర్శకుడు హరీశ్ శంకర్ సవాల్ విసిరారు. పదే పదే తనను లక్ష్యంగా చేసుకొని విమర్శలకు దిగుతున్నారంటూ ఛోటా కే నాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం ఓ లేఖను హరీశ్ శంకర్ విడుదల చేశారు. వయసులో పెద్దవారు అని గౌరవిస్తున్నానంటూనే ఆయన ఛోటాపై వ్యంగాస్త్రాలు సంధించారు. "రామయ్యా వస్తావయ్యా' సినిమా ఫ్లాప్ అయినా ఆ నింద మీపై మోపలేదు. ఆ సినిమా తీసి పదేళ్లు దాటిపోయింది. అప్పటి నుంచి ఇప్పటిదాకా పలు ఇంటర్వ్యూల్లో మీరు కావాలని పదే పదే నా ప్రస్తావన తెచ్చి అవమానిస్తున్నారు. మీపైన ఉన్న గౌరవంతో ఇన్నాళ్లు భరించాను. ఈ విషయాన్ని ఇక్కడితో వదిలేయండి. కాదూ కూడదు మళ్లీ కెలుక్కుంటాను అంటే ఎక్కడైనా, ఏ వేదికమీదైనా, నేను సిద్ధం' అని హరీశ్ శంకర్ హెచ్చరించారు. "రామయ్యా వస్తావయ్యా' షూట్‌లో కెమెరా డిపార్ట్‌మెంట్‌లో హరీశ్ శంకర్ జోక్యం చేసుకున్నారు. అది సబబు కాదని వారించినా ఆయన వినలేదు" అని ఛోటా కె నాయుడు విమర్శించడమే ఈ వివాదానికి కారణమైంది.



ఓటుకు రూ. ఐదువేలు

సాయికుమార్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'లక్ష్మీ కటాక్షం'. 'ఫర్ ఓట్' అనేది ఉపశీర్షిక. వినయ్, అరుణ్, దీప్తివర్మ, ఆమని కీలకపాత్రలు పోషించారు. సూర్య దర్శకుడు. విడుదలకు సిద్ధమైన ఈ చిత్రం ట్రైలర్‌ను యూనిట్ విడుదల చేసింది. ఎన్నికల్లో గెలిచేందుకు వ్యూహాలు పన్నే రాజకీయ నాయకుడిగా సాయికుమార్ కనిపించారు. తను పోటీ చేసే నియోజకవర్గంలో ఒక్కో ఓటుకు రూ. 5వేలు చొప్పున మొత్తం రూ. 100 కోట్లు పంచేందుకు ఆయన ఎలాంటి ప్రయత్నం చేశారనేది ఆసక్తికరంగా అనిపించింది. యు. శ్రీనివాసుల రెడ్డి, బి. నాగేశ్వరరెడ్డి, వహీద్ షేక్, కే పేరుషోత్తం రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫుస్. సినిమాటోగ్రఫీ: నని ఐనవెల్లి

మరో సినిమా చేద్దాం అన్నారు

మహేంద్రనాథ్ కూండ్ల



వరలక్ష్మీ శరత్ కుమార్ ప్రధాన పాత్రలో నటించిన సినిమా 'శబరి'. మహర్షి కూండ్ల సమర్పణలో మహా మూవీస్ పతాకంపై మహేంద్రనాథ్ కూండ్ల నిర్మించారు. అనిల్ కాట్జ్ దర్శకుడు. తెలుగుతో పాటు తమిళ, మలయాళ, హిందీ, కన్నడ భాషల్లో మే 3న సినిమా విడుదల అవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత మహేంద్రనాథ్ కూండ్ల మీడియాతో ముచ్చటించారు. "నిర్మాతగా నా సినిమా జర్నీని ప్రారంభించేందుకు చూస్తున్న సమయంలో దర్శకుడు అనిల్ ఈ కథ చెప్పారు. ఒక బిడ్డ కోసం తల్లి పడే తపనను సైకలాజికల్ థ్రిల్లర్‌గా దర్శకుడు చెప్పారు. ఇందులోని భావోద్వేగాలు అందరినీ కట్టిపడేస్తాయి. ఈ సినిమా కథను నాకంటే ముందే వరలక్ష్మి శరత్‌కుమార్ విని ఓకే చేశారని దర్శకుడు చెప్పారు. ఆమె వండర్‌ఫుల్ నటి. నిర్మాతలను వరలక్ష్మి శరత్‌కుమార్ ఎప్పుడూ ఇబ్బంది పెట్టరు. ఆమెతో ఈ సినిమాతో మంచి రిలేషన్ బిల్డ్ అయ్యింది. 'శబరి' తర్వాత మరో సినిమా చేద్దాం అని ఆమె అనడం ఎంతో ఆనందాన్ని ఇచ్చింది" అని చెప్పారు.

బెస్ట్ ఓటీటీ షోలు తెలుగులో



ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ మినీ టీవీ ప్రేక్షకులకు సరికొత్త సేవలను అందుబాటులోకి తెచ్చింది. వివిధ భాషల్లో అత్యంత ప్రేక్షకాదరణ పొందిన షోల తెలుగు, తమిళ డబ్బింగ్ వెర్షన్లను అందుబాటులోకి తెచ్చింది. 'రక్షక్, ఇండియాస్ బ్రేవ్స్, ఫిజిక్స్‌వాలా' లాంటి 200కు పైగా షోలతో పాటు పలు హాలీవుడ్ చిత్రాల డబ్బింగ్ వెర్షన్లు ఇందులో ఉచితంగా చూడొచ్చు అని ఆ సంస్థ తెలిపింది. వీటితో పాటు కొరియన్, టర్కిష్, మాండరిన్ షోలను సైతం వినియోగదారులు వీక్షించవచ్చు అని అమెజాన్ కంటెంట్ హెడ్ అమోఘ్ దుసాద్ ఓ ప్రకటనలో తెలిపారు.